నేటి కందం- నేటికి అందం

ఎన్నగ జాలని కరణిన
మిన్నగ పాటించ వలెను మించిన ధృతిలోన్
కన్నులు కరవగు వారికి
కన్నులుగా నుండు నూత క్రల దినమున్

(అక్టోబరు 15 దివ్యనేత్రుల ఊతక్రల దినం)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

సర్కారు ఎవరిదైనా
సమయోచిత నిర్ణయం
కొరవడితే ప్రజలచేత
క్రరువాతే అభినయం
అసంతృప్తే గద్దె కూల్చే
ఆయుధ పరమాణువు
నిర్లక్ష్యం చేస్తే నిత్య
నీడలా వెంటాడే ధనువు

-వేల్పుల నారాయణ
9440433475



website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 15-10-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:62 పేజిలు:6 వెల: రూ.1/-


# బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలంగాణలో ఐదురోజులు వానలే వానలు..



హైదరాబాద్, అక్టోబర్ 14 : తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అవకాశం ఉందని పేర్కొంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని.. వాయువ్య దిశగా కదులుతూ మరింత బలంగా మారుతుందని పేర్కొంది. మంగళవారం ఉదయం వరకు మధ్యబంగాళాఖాతం వరకు చేరుతుందని చెప్పింది. ఆ తర్వాత రెండురోజుల్లో మరింత ముందుకు కదులుతూ పశ్చిమ వాయువ దశగా కదులుతూ తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఏపీ తీరాలకు చేరే అవకాశం ఉందని వెల్లడించింది.

సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలుపడుతాయని చెప్పింది. మంగళవారం నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జనగాం, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

# రెండు ప్రైవేటు బస్సులు ఢీ.. 40 మందికి గాయాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : : కేరళలో రెండు ప్రైవేట్ బస్సులు ఒక దానిని ఒకటి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. కేరళ రాష్ట్రం కోజికోడ్ జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నామని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలించామని వెల్లడించారు.

కోజికోడ్ జిల్లా అథోలి సమీపంలోని కొలియోట్టుతాజామ్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అతి వేగం ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. బస్సులు ఢీకొన్న వేగానికి డ్రైవర్ల క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైందని అన్నారు. స్థానికుల సాయంతో సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. నలుగురికి తీవ్రగాయాలయ్యాయని అన్నారు.

# ఒక్క మెస్సేజ్‌తో సమస్యలు పరిష్కరిస్తా -దివ్యాంగులకు మంత్రి సీతక్క భరోసా




హైదరాబాద్, అక్టోబర్ 14 : తెలంగాణ ప్రభుత్వం వికలాంగుల జాబ్ పోర్టల్ ను ఏర్పాటు చేసింది. దివ్యాంగులు ఆఫీసర్లు చుట్టూ తిరిగే పనిలేకుండా నేరుగా జాబ్ పోర్టల్ లో అప్లై చేసుకుంటే చాలని, వారి అర్హతను బట్టి ఉద్యోగం ఉంటుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శుభవార్త చెప్పారు. సచివాలయంలో నేడు జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల జాబ్ పోర్టల్ ను ఆవిష్కరించారు. మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరెట్ హెల్ప్ లైన్ లో పదిమందికి అపాయింట్మెంట్ ఆర్డర్లు అందజేశారు.

ఈ సందర్భంగా సీతక్క మాటాడుతూ.. ఉపాధి రంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు తక్కువ అన్నారు. ఇతర వర్గాల వర్గాల వారిలా ఫైట్ చేయాలంటే ఎన్నో అవరోధాలు ఎదుర్కొవలసి ఉంటుందన్నారు. శారీరకంగా వచ్చే లోపం మన చేతిలో లేదన్నారు. పోషకాహార లోపం, ప్రమాదం వల్ల వికలాంగులుగా మారే ప్రమాదం వుందన్నారు. అందుకే వాళ్లకి ఉపాది అవకాశాలు కల్పించేందుకు ఆన్లైన్ జాబ్ పోర్టల్ ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఉద్యోగాల్లో వికలాంగులకు రిజర్వేషన్లు పాటించాలని తెలిపారు.

## రిజర్వేషన్ శాతం పెంచుతాం

ఇక దివ్యాంగులు కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఆన్లైన్ జాబ్ పోర్టల్ లో రిజిస్టర్ చేసుకుంటే చాలని అన్నారు.. వారి అర్హతను బట్టి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. అందుకోసమే పోర్టల్ లో అందుబాటులోకి తెచ్చామన్నారు. సంక్షేమ నిధుల్లో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయిస్తున్నామన్నారు. ప్రైవేట్ జాబ్ లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రయత్నిస్తున్నామన్నారు. గతంలో ఒక శాతం ఉంటే దాన్ని నాలుగు శాతానికి పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

## ఇందిరరమ్మ ఇళ్లలోనూ రిజర్వేషన్

ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు పాటిస్తామన్నారు. డిసబిలిటీని దృష్టిలో పెట్టుకొని వారిని ముందుకు తీసుకురావడానికి మా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. సంక్షేమము, విద్యా, ఉద్యోగ రంగంలో దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. దివ్యాంగుల పరికరాల కోసం ఈ ఏడాది బడ్జెట్లో 50 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. దివ్యాంగులు ఆఫీసర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా మాకే..మీ సమస్యలను షేర్ చేయొచ్చని తెలిపారు. మెసేజ్ పాస్ చేస్తే చాలు సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

## బ్యాక్ లాగ్ పోస్ట్ లు భర్తీ చేస్తాం..

బ్యాక్ లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. చాల కాలంగా పెండింగ్ లో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలుపెట్టామన్నారు. అవకాశాలను బట్టి ఏ రంగం మీద మక్కువగా ఉంటే ఆ రంగంలోకి వెళ్ళండి.. పని చేయండి అన్నారు. దివ్యాంగులు స్వయం ఉపాధి కోసం చేయూతనిస్తామని తెలిపారు. వారి శక్తిని బట్టి ఉపాధి అవకాశాలు కలిపిస్తామన్నారు.

అనంతరం మహిళా శిశు సంక్షేమ డైరెక్టరేట్ కాల్ సెంటర్లో పదిమంది దివ్యాంగులకు అపాయింట్మెంట్ ఆర్డర్స్ ను మంత్రి సీతక్క అందించారు. ఇక సుహాసిని -హెల్ప్ లైన్ అడ్మినిస్ట్రేటర్, ఎం లక్ష్మి -ఐ టి సూపర్వైజర్ , కాల్ ఆపరేటర్లుగా మామిడి లావణ్య , కే లలిత, పార్వతమ్మ , మేడిశ్రీకాంత్, కొన్నోజు నాగలక్ష్మి, ఎం. రజిత, సిహెచ్ సుమిత్ర, అపాయింట్మెంట్ ఆర్డర్లు అందుకున్నారు.

# ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : ఆర్థికశాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి వరించింది. రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ అవార్డును ప్రకటించింది. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన డారన్ ఏస్‌మోగ్లు, సిమన్ జాన్సన్, యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన జేమ్స్.ఎ.రోబిన్‌సన్‌లకు ఈ యేటి ఎకనామిక్స్ నోబెల్ దక్కింది. సమాజ శ్రేయస్సును నిర్ణయించడంలో సంస్థల పాత్రపై వీరు చేసిన అధ్యయనానికి గానూ నోబెల్ బహుమతి దక్కింది.

గతేడాది కూడా ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ పురస్కారం దక్కింది. బెన్ ఎస్ బెర్నాంకి, డగ్లస్ డబ్ల్యూ. డైమండ్, ఫిలిప్ హెచ్.దిబ్విగ్‌లు నోబెల్‌ను అందుకున్నారు.

బ్యాంకులు, ఆర్థిక సంక్షోభాలపై ఈ ముగ్గురు పరిశోధనలు చేశారు. ఆర్థిక సంక్షోభాల వేళ బ్యాంకుల పాత్ర ఎంత ముఖ్యమైందన్న విషయాన్ని ఈ ముగ్గురూ తమ పరిశోధనల్లో వెల్లడించారు. బ్యాంకులు దివాళా తీయకుండా ఉండేందుకు ఈ స్టడీ చాలా కీలకమైందని నోబెల్ కమిటీ అభిప్రాయపడింది.

కాగా, స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఏటా ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న విషయం తెలిసిందే.

1896లో ఆల్‌ఫ్రెడ్ నెబెల్ మరణించగా.. 1901 నుంచి ఆయన జ్ఞపకార్థం ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే వైద్య, భౌతిక, రసాయన శాస్త్రాల్లో, సాహిత్యంలో నోబెల్ గ్రహీతల పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇవాళ అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రకటించారు. ఈ అవార్డు గ్రహీతలకు 11 లక్షల స్వీడిష్ క్రోనర్ (10 లక్షల డాలర్లు) నగదు అందుతుంది.

# ఓ డ్రస్ గురించి భార్యను హత్య చేసిన భర్త

హైదరాబాద్, అక్టోబర్ 14 : ఓ డ్రస్ గురించి భార్యభర్తల మధ్య గొడవ జరిగి.. భార్యను భర్త హత్య చేసిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాలు? ప్రకాశం జిల్లాకు చెందిన గంజి వెంకటేష్, గంజి సోను (32) దంపతులు ఇద్దరు పిల్లలతో నగరానికి వచ్చి గడ్డిఅన్నారం సరస్వతీనగర్ కాలనీలో నివసిస్తున్నారు. వెంకటేష్ కూలిపని చేస్తుండగా సోను ఇళ్లలో పనిచేస్తుంది. వీరికి గోవిందరాజు (14), మురళీ కృష్ణ (11) ఇద్దరు కుమారులున్నారు.

గత మూడేళ్లుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం సోను పంజాబీ డ్రస్ వేసుకోగా వెంకటేష్ కు నచ్చలేదు. వద్దని వారించినా వినకపోవటంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది.

ఈ దశలో వెంకటేష్ ఆవేశంగా కూరగాయలు కోసే చాకు తీసుకుని భార్యను కడుపులో, వీపుపై పొడిచాడు. దీంతో సోను రక్తపు మడుగులో పడి అక్కడికక్కడే మృతిచెందింది.

గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. భార్యపై దాడి చేసే సమయంలో వెంకటేష్ చేతికి స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

# గ్రూప్-1 మెయిన్స్ హాల్ టికెట్లు విడుదల.. 21 నుంచి పరీక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 14 : గ్రూప్-1 మెయిన్స్ (ఉతీనీబీజూ 1 ఓజీతినిబ) హాల్ టికెట్లను టీజీపీఎస్సీ సోమవారం మధ్యాహ్నం విడుదల చేసింది. హాల్ టికెట్లను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 21 ఉదయం వరకు హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. హైదరాబాద్(హెచ్ఎండీఏతో సహా) పరిధిలో అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగనున్నాయి.

563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రిలిమ్స్ పరీక్షలను నిర్వహించి ఫలితాలను కూడా విడుదల చేసింది. మెయిన్స్ పరీక్షల నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే గైడ్‌లైన్స్ కూడా విడుదల చేసింది. తొలిరోజు తీసుకెళ్లిన హాల్ టిక్కెట్‌నే మిగిలిన ఆరు పరీక్షలకు తీసుకెళ్లాలని.. రోజుకో కొత్త హాల్ టిక్కెట్‌తో వెళితే అనుమతించేది లేదని స్పష్టం చేసింది. ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా ప్రతిపరీక్ష రోజు హాల్ టిక్కెట్‌పై తప్పనిసరిగా సంతకం చేయాలని తెలిపింది. నియామక ప్రక్రియ పూర్తి అయ్యేవరకు హాల్ టికెట్‌ను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించింది.

గ్రూప్-1పై రేపు హైకోర్టు తీర్పు..

కాగా, గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సంబంధించి దాఖలైన పలు కేసులపై హైకోర్టు తుది తీర్పును మంగళవారం వెలువరించనున్నది. ఆయా కేసుల్లో ఇప్పటికే విచారణను పూర్తిచేసిన హైకోర్టు తీర్పును మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు తీర్పునివ్వనుంది. ఈ తీర్పు ఎవరికి అనుకూలంగా వస్తుందోనన్న ఉత్కంఠ నెలకొన్నది. గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫైనల్ 'కీ'లో తప్పులున్నట్టు తాము ఆధారాలతో సహా కోర్టుకు సమర్పించామని, కాబట్టి తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని అభ్యర్థులు భావిస్తున్నారు. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదని, వికీపీడియా, గూగుల్ ఆధారంగా ఫైనల్ 'కీ'ని రూపొందించామని టీజీపీఎస్సీ హైకోర్టుకు తెలపడం వంటి అంశాలు తమకు అనుకూలంగా మారతాయని అభ్యర్థులు అంచనా వేస్తున్నారు.

గ్రూప్-1పై హైకోర్టులో 15కుపైగా కేసులు ఉన్నాయి. వీటిలో ఫైనల్ 'కీ'పై వేసిన కేసు అత్యంత కీలకమైనది. వీటితోపాటు ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి జీవో-33పై దాఖలైన కేసు, గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి 503 పోస్టులు, కొత్త నోటిఫికేషన్‌లో అదనంగా చేర్చిన 60 పోస్టులకు కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి అవకాశం ఇవ్వాలన్న అంశంపై వేసిన కేసు, హైకోర్టు మళ్లీ రీ ఎగ్జామ్ నిర్వహించాలని ఆదేశించిన నేపథ్యంలో, పాత నోటిఫికేషన్‌ను రద్దుచేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వడంపై వేసిన కేసులపై కూడా తీర్పు రానున్నది. ఈ నెల 16న రిజర్వేషన్లపై వేసిన మరో మూడు కేసులు సైతం హైకోర్టు ముందు విచారణకు రానున్నాయి.

# 'ఒక్కరోజే నాలుగొందలు కొడుతాం'.. ప్రత్యర్థులకు గంభీర్ హెచ్చరిక




న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : స్వదేశంలో వరుసగా 18వ టెస్టు సిరీస్ విజయం.. ఆ వెంటనే రికార్డు స్కోర్‌తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్. సొంతగడ్డపై టీమిండియా ఎంత శక్తివంతమైనదో చెప్పడానికి ఈ రెండు ఉదాహరణలు చాలు. బంగ్లాదేశ్‌పై చిరస్మరణీయ టెస్టు విజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (చిఅ)ఫైనల్ రేసులో ముందున్న భారత జట్టు స్వదేశంలో మరో సిరీస్ ఆడనుంది. బంగ్లాను చావుదెబ్బ కొట్టిన టీమిండియా ఇక న్యూజిలాండ్ తో అమీతుమీ తేల్చుకోనుంది.

డబ్ల్యూటీసీలో హ్యాట్రిక్ ఫైనల్‌పై కన్నేసిన రోహిత్ సేన అందుకు కివీస్‌ను వైట్‌వాష్ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో హెడ్‌కోచ్ గౌతం గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఒక్కరోజులోనే 400లు కొట్టగల జట్టుగా ఎదగాలి. అవసరమైతే రెండు రోజులు బ్యాటింగ్ చేసి మరీ మ్యాచ్‌ను డ్రా చేసుకోగలగాలి. టీమిండియాలో ఈ విధమైన అనుకూలత కోసం ఎదురు చూస్తున్నాం. టెస్టు క్రికెట్ అంటే అదే మరి. మా డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ రెండూ చేయగల సమర్థులైన బ్యాటర్లు ఉన్నారు.

ఒక్కరోజులోనే 400 కొట్టడం అనేది మ్యాచ్ గెలవడం కోసమే. అదీ కాదు పరిస్థితులు తారుమారైతే రెండు రోజులు క్రీజులో ఉండి డ్రా చేసుకోవాలి. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇదే మా రెండో, మూడో ప్రాధాన్య అంశం' అని గంభీర్ మీడియా సమావేశంలో తెలిపాడు. కాన్పూర్ టెస్టులో 'బజ్ బాల్'ను తలదన్నేలా ఆడిన భారత ఆటగాళ్లు.. ఉప్పల్ స్టేడియంలో బంగ్లాదేశ్‌పై బౌండరీలతో విరుచుకుపడ్డారు.

# మూసీ పరివాహక ప్రాంతాల్లో వెలిసిన హైకోర్టు స్టే ఆర్డర్లు

హైదరాబాద్, అక్టోబర్ 14 : మూసీ సుందరీకరణ పేరిట.. లక్షలాది ఇండ్లను నేలమట్టం చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు ఇండ్లకు రెడ్ మార్క్ వేశారు. కొంతమంది నివాసితులను కూడా ఖాళీ చేయించారు అధికారులు. ఈ క్రమంలో కోట్ల రూపాయాలు పోసి కొన్న తమ ఇండ్ల జోలికి రావొద్దంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కొందరు హెచ్చరించారు. అయిన ప్పటికీ రేవంత్ సర్కార్ ముందడుగు వేయడంతో.. బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. ఇక తమ ఇండ్లను కూల్చివేయదంటూ మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. హైదరాబాద్‌లోని చైతన్యపురి, ఫణిగిరి కాలనీ, సత్యానగర్, కొత్తపేటలో మూసీ పరివాహక ప్రాంతాల్లో ఏ ఇంటి వద్ద చూసిన కోర్ట్ స్టే లే దర్శనమిస్తున్నాయి. దాదాపు 100 ఇండ్ల యజమానులు కోర్టు స్టే తెచ్చుకున్నారు.

# తెలంగాణలో రూ. 1100 కోట్లు దాటిన దసరా మద్యం అమ్మకాలు

హైదరాబాద్, అక్టోబర్ 14 : దసరా పండుగ నేపథ్యంలో తెలంగాణలో జోరుగా మద్యం అమ్మకాలు కొనసాగాయి. రాష్ట్రంలో దసరా మద్యం అమ్మకాలు రూ. 1100 కోట్లు దాటాయి. ఈ నెల 11న ఒక్కరోజే రూ. 200.44 కోట్లు, 10న రూ. 152 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. అక్టోబర్ 1 నుంచి 10 వరకు రూ. 852.40 కోట్ల విలువైన మందు అమ్ముడైనట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. బార్లు, మద్యం దుకాణాలతో పాటుగా పబ్ లలోనూ అమ్మకాలు పెరిగాయి. దీంతో సర్కార్ ఖజానాకు.. మద్యం భారీగా ఆదాయం తెచ్చి పెట్టింది. మద్యం అమ్మకాల్లో ఎప్పటిలాగే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది.

రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. వీటితో పాటుగా పబ్బుల్లోనూ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. దసరాకు ముందు నుంచే మొదలైన మద్యం కిక్కు శని, ఆదివారాల్లో పీక్స్‌కు చేరింది. సెప్టెంబర్ 30 వరకు 2 వేల 838 కోట్ల అమ్మకాలు జరగ్గా అక్టోబర్ నెల ప్రారంభం నుంచి 11వ తేదీ వరకు రూ 1,100 కోట్ల మేర విలువైన 10 లక్షల 44వేల కేసుల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. 10 రోజులవ్యవధిలోనే 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయాయుట. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డి టాప్‌లో ఉండగా ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, వరంగల్ జిల్లాలు తర్వాతి మూడు స్థానాల్లో ఉన్నాయి.

# కోచ్ లేకున్నా వరల్డ్ రికార్డు.. చరిత్ర సృష్టించిన కెన్యా అథ్లెట్




న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : మరాథాన్ పరుగు అంటే చాలు ఆఫ్రికా దేశాల అథ్లెట్లదే అగ్రస్థానం. విశ్వ క్రీడల నుంచి ఇతర పోటీల్లోనూ సుదీర్ఘ పరుగు పందెంలో వాళ్లే ఎక్కువగా విజేతలుగా నిలుస్తుంటారు. తాజాగా కెన్యా అథ్లెట్ రుత్ చెప్ఞెగెటిక్ సరికొత్త చరిత్ర సృష్టించింది. చికాగో మారథాన్ 42.19 కిలోమీటర్ల పందెంలో బరిలోకి దిగిన ఆమె ట్రాక్ మీద తన సత్తువకు తిరుగులేదని చాటుతూ వరల్డ్ రికార్డు బద్దలు కొట్టింది. అది కూడా ఎవరి దగ్గర కోచింగ్ తీసుకోకుండానే ఆమె రికార్డు బ్రేక్ చేయడం విశేషం. సోమవారం జరిగిన చికాగో మారథాన్ పోటీల్లో 30 ఏండ్ల రుత్ సత్తా చాటింది. పట్టువదలని యోధురాలిలా దౌడు తీసిన ఆమె 2:09:56 గంటల్లో లక్ష్యాన్ని చేరుకుంది. అంతే ప్రపంచ రికార్డు ఆమెకు దాసోహం అయింది. రెండు నిమిషాల తేడాతో రుత్ సరికొత్త చాంపియన్‌గా రికార్డు పుస్తకాల్లో తన పేరు పదిలం చేసుకుంది.

# "మెసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా" మన అబ్దుల్ కలాం

(15 అక్టోబర్ 'అబ్దుల్ కలాం జయంతి' సందర్భంగా)

'లీడ్ ఇండియా' అంటూ యువతను దేశాభివృద్ధి మహాయజ్ఞంలో పాలు పంచుకోవాలని పిలుపును ఇచ్చిన మన ప్రియతమ ఏ. పి. జె. అబ్దుల్ కలాం భరతమాత ముద్దు బిడ్డగా జాతి గౌరవాన్ని అంతర్జాతీయ వేదికల మీద చాటి చెప్పి అనన్య సామాన్యుడు, మేరునగ ధీరుడు, అనితరసాధ్య ఘనుడు. భారత 11వ రాష్ట్రపతిగా (2002-07) విశిష్ట సేవలందించి 'పీపుల్స్ ప్రెసిడెంట్'గా ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసిన అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం 15 అక్టోబర్ 1931న ప్రముఖ దక్షిణ భారత తీర్థ స్థలం రామేశ్వరం పట్టణంలో పేద తమిళ ముస్లిమ్ కుటుంబంలో ఆశియమ్మ - జైనులబ్దీన్ దంపతులకు జన్మించారు. రామేశ్వరంలో పాఠశాల విద్య, తిరుచురాపల్లి సెయింట్ జోసెఫ్ కాలేజీలో భౌతిక శాస్త్రం (1954), మద్రాస్ యంఐటిలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ (1960) పట్టాలు పొందారు.

## మెసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా:

అతి సాధారణ విద్యార్థి దశ నుంచి అసాధారణ మేధావిగా కలాం ఎదిగిన క్రమం విలక్షణం, ఆశ్చర్యకరం. నాలుగు దశాబ్దాల ఉద్యోగపర్వంలో ఏరోస్పేస్ సైంటిస్ట్‌గా, సైన్స్ అడ్మినిస్ట్రేటర్‌గా విలక్షణ సేవలందించే క్రమంలో డిఆర్‌డిఓ (డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలంప్‌మెంట్ ఆర్గనైజేషన్), ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసర్చ్ ఆర్గనైజేషన్) సంస్థల్లో పరిపాలనాదక్షుడిగా, మిలటరీ మెసైల్ రూపశిల్పిగా తన సత్తా చాటి 'మెసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా కీర్తించబడ్డారు. ప్రధాని ముఖ్య వైజ్ఞానిక శాస్త్ర సలహాదారుగా, డిఆర్‌డిఓ సెక్రటరీగా 1992 నుంచి 1999 వరకు పని చేశారు. స్వావలంభన దిశగా భారతదేశాన్ని న్యూక్లియర్ ఎనర్జీ కలిగిన దేశంగా నిలపటానికి 1998లో పోక్రాన్-? పరీక్షలను పర్యవేక్షించి ప్రజల చేత జేజేలు అందుకున్నారు. భారత వాయు సేనలో ఫైటర్ పైలెట్‌గా పని చేయాలనుకున్న కలాం ఏరోస్పేస్ శాస్త్రజ్ఞుడిగా ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగారు. ఇంజనీర్, సైంటిస్ట్, రచయిత, ఆచార్యులు, యువత ఆరాధ్య దైవం, ఆదర్శ రాజకీయవేత్త, యువతకు మార్గదర్శిగా బహుముఖీన ప్రతిభ కలిగిన అబ్దుల్ కలాం బోధనలు అనితరసాధ్యాలు. నేను చేయగలననే దృఢ సంకల్పమే విజయాలను అందిస్తుందని, ఎవరి తలరాతను వారే లిఖించుకోవాలని, నిజాయితీగల హృదయంతోనే అసలైన ఆకర్షణీయ వ్యక్తిత్వం వ్యక్తం అవుతుందని బోధనలు చేశారు.

## కలలు కందాం, సాకారం చేసుకుందాం:

'ఉన్నత కలలు కనండి, సాకారానికి కఠోర సాధన చేయండి' అంటూ నినదించిన కలాం జీవితం తెరిచిన పుస్తకం, యువతకు మార్గదర్శకం. పడవలు నడిపే వృత్తిలో పేరుగాంచిన కలాం కుటుంబం, వ్యాపారంలో నష్టం రావడంతో కష్టాల కడలిలో పట్టుదలతో చదువులను కొనసాగిస్తూ, పేపర్ బాయ్‌గా పని చేస్తూ, ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌ను పూర్తి చేయగలగడం నేటి యువతకు ప్రేరణాత్మకం. ఉద్యోగిగా తన సీనియర్స్ డా: విక్రమ్ సారాభాయ్, ఆచార్య సతీష్ ధవన్, డా: బ్రహ్మ ప్రకాశ్ లాంటి దిగ్గజాల వద్ద నాయకత్వ పటిమను, అంతరిక్ష శాస్త్రసాంకేతిక మెలకువలను నేర్చుకున్నారు. 1969లో ఇస్రోకు బదిలీ అయిన కలాం నేతృత్వంలో భారత తొలి స్వదేశీ పరిజ్ఞానంతో 'సాటలైట్ లాంచింగ్ వెహికిల్ (యస్‌యల్‌వి-3')ను రూపొందించుటలో విజయం సాధించారు. 1970-90ల మధ్య పియస్‌యల్‌వి (పోలార్ సాటలైట్ లాంచింగ్ వెహికిల్)తో పాటుగా యస్‌యల్‌వి-3లను అభివృద్ధి చేయుటలో ప్రధాన భూమికను నిర్వహించారు. 'బాలిస్టిక్ మెసైల్' టెక్నాలజీతో 'ప్రాజెక్ట్ డెవిల్', 'ప్రాజెక్ట్ వాలియంట్'లను రూపొందించడంలో మార్గదర్శనం చేశారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మెసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐజియండిపి) ద్వారా కలాం చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ? 3.88 బిలియన్ పెట్టుబడితో పరిశోధనలు కొనసాగించారు. 'అగ్ని', 'పృథ్వీ'మెసైల్‌లను విజయవంతంగా నిర్మించగలిగారు. 1998లో చవకైన 'కలాం-రాజు కరోనరీ స్టంట్'ను, 2012లో 'కలాం-రాజు టాబ్లెట్' హెల్త్‌కేర్ కంప్యూటర్‌ను రూపొందించారు. టెక్నాలజీ సహాయంతో ఆర్థిక, వ్యవసాయ, ఆరోగ్య, విద్యారంగాలను పరిపుష్టం చేయవచ్చుని గట్టిగా నమ్మిన కలాం ముందు చూపు అద్వితీయం. 'జననం సాధారణమే కావచ్చు, మరణం మాత్రం చరిత్ర సృష్టించేదిగా ఉండాలని' ఉద్భోధించారు.

## లీడ్ ఇండియా రూపశిల్పి:

25 జూలై 2002న రాష్ట్రపతి పదవిని చేపట్టి భారత తొలి పౌరుడిగా 'ప్రజా రాష్ట్రపతి'గా పేరు తెచ్చుకున్నారు. భారత అత్యుత్తమ 'భారత రత్న'ఆవార్డు పొందిన ఏకైక తొలి సైంటిస్ట్, బాచిలర్ కలాం అనంతరం రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించారు. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన అనంతరం అబ్దుల్ కలాం 'లీడ్ ఇండియా - 2020' ఉద్యమాన్ని ప్రారంభించి ఐదేళ్ళలో 5 లక్షల యువతకు మార్గదర్శకం చేయాలనే లక్ష్యాన్ని ఛేదించుటకు కృషి చేశారు. నేటికీ కలాం స్థాపించిన 'లీడ్ ఇండియా ఫౌండేషన్' అనబడే 2వ స్వాతంత్ర్య ఉద్యమాన్ని తన అభిమానులు 'లీడ్ ఇండియా నేషనల్ క్లబ్స్' వేదికగా యువతను సన్మార్గంలో నిలిపే పలు అసమాన్య సేవలను కొనసాగించడం హర్షదాయకం. అనేక అగ్ర విద్యాసంస్థలు ఐఐయం, ఐఐయస్‌సి, ఐఐఐటి, బిహెచ్‌యు, అన్నా విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా అమూల్య సేవలు, అనుభవసారాలు అందజేశారు. తన జీవితకాలంలో 40కి పైగా విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకోగలిగారు.

## పురస్కారాలే పులకించిన వేళ:

అత్యుత్తమ పౌర పురస్కారం భారత రత్నతో పాటు పద్మవిభూషణ్, పద్మ భూషన్, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యత ఆవార్డు, వీర సావర్కర్, శస్త్ర రామానుజన్, వాన్ బ్రాన్ లాంటి పలు ఆవార్డులతో సన్మానాలు అందుకున్నారు. తన అనుభవాలను, ఆలోచనలను భవిష్యత్ తరాలకు అందించాలనే సదుద్దేశ్యంతో 'వింగ్స్ ఆఫ్ ఫైర్', 'ఇండియా-2020', 'ఇగ్నైటెడ్ మైండ్స్', 'ఇండామిటబుల్ స్పిరుట్స్' లాంటి పలు పుస్తకాలు రచించారు. 26 జూలై 2015న ఐఐయం, షిల్లాంగ్‌లో విద్యార్థి యువతతో ముచ్చటిస్తూనే 83వ ఏట తుది శ్వాస విడిచిన ఏ. పి. జె. అబ్దుల్ కలాం జీవితం ఆసాంతం అనుసరణీయం, సదా స్మరణీయం.

బలమైన విజయకాంక్షతోనే అపజయాలను అధిగమించాలని, విద్య రెక్కలతోనే ఎదిగాలంటూ నినదించిన కలాం దార్శనికత పరమ పవిత్రం, ప్రగతికి ఇంధనం. 'సక్సెస్ అంటే మన సంతకం ఆటోగ్రాఫ్‌గా మారాడమే' అన్న కలాం 'కల అంటే నిద్రలో వచ్చేది కాదని, నిద్ర పోనివ్వకుండా విజయం వరించే దాకా మనల్ని కార్యోన్ముఖులను చేసేది' అని నమ్మిన అపూర్వ మూర్తిమత్వ నిధి మన అజేయ అబ్దుల్ కలాం సామాన్య ప్రజల మదిలో తిష్టవేసిన ప్రేరణామూర్తి, నిత్య చైతన్య స్ఫూర్తి.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# హైదరాబాద్‌లోని 'జీఎస్ఐటీఐ'లో పైకప్పు సౌర విద్యుత్ ప్లాంటు ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : పరిశుభ్ర, హరిత భారత్ దిశగా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక దృక్పథానికి మరింత బలం చేకూరుస్తూ కేంద్ర బొగ్గు-గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి ఈ రోజు హైదరాబాద్‌లోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (జిఎస్ఐటిఐ)లో పైకప్పు సౌర విద్యుదుత్పాదక వ్యవస్థను ప్రారంభించారు. ఎం.ఎస్.కృష్ణన్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమం సుస్థిర ఇంధనంపై 'జిఎస్ఐటిఐ' నిబద్ధతలో ఓ కీలక ముందడుగును సూచిస్తోంది.

ఈ సౌర విద్యుత్ ప్లాంటు ప్రారంభం ద్వారా 'జిఎస్ఐటిఐ'లో కర్బన ఉద్గారాల తగ్గింపు దిశగానే కాకుండా ప్రభుత్వ సంస్థలలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంలో ముఖ్యమైన ముందడుగు పడింది. కాగా, సంస్థ ఇంధన అవసరాలను గణనీయ స్థాయిలో తీర్చగలిగేలా ఈ ప్లాంటు విద్యుదుత్పాదన చేయగలదని అంచనా. తద్వారా వివిధ మార్గాల్లో ఉత్పత్తయ్యే ఇంధన వనరులలో పునరుత్పాదక ఇంధనం వాటా పెంచాలన్న భారత్ భారీ లక్ష్య సాధనలో ఇది తనవంతు పాత్ర పోషించనుంది.

'జిఎస్ఐటిఐ'లో సౌర విద్యుత్ ప్లాంటును ప్రారంభించిన సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ- సుస్థిర ఇంధనం దిశగా సంస్థ నిబద్ధతను ప్రశంసించారు. ఈ మేరకు "పర్యావరణం పట్ల బాధ్యత, ఇంధన పొదుపు, సుస్థిర ప్రగతి వైపు ఇదొక ముఖ్యమైన ముందడుగు" అని ఆయన పేర్కొన్నారు. వాతావరణ మార్పులపై పోరాటంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వాన వివిధ కార్యక్రమాల అమలు ద్వారా భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఆవిర్భవించిందని తెలిపారు. "ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' ద్వారా అనేక కుటుంబాలు నేడు సౌరశక్తిని సద్వినియోగం చేసుకుంటున్నాయి. ప్రస్తుతం 'జిఎస్ఐటిఐ'లో ఏర్పాటు చేసిన 150 కిలోవాట్ల పైకప్పు సౌర విద్యుత్ ప్లాంటు సంస్థ అవసరాలలో 75 శాతం తీర్చగలదు. దీనివల్ల ఏటా రూ.30 లక్షల దాకా ఆదా కావడమేగాక ప్రభుత్వ సంస్థలలో పునరుత్పాదక ఇంధన వినియోగంలో ఇది కొత్త ప్రమాణం సృష్టిస్తుంది" అని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (దక్షిణ ప్రాంత) అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీ ఎస్.డి.పట్నాజే కూడా ప్రసంగిస్తూ- సుస్థిర ప్రగతిలో ఈ ప్రాజెక్టుకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. అలాగే జాతీయాభివృద్ధిలో పునరుత్పాదక ఇంధనానికిగల కీలకపాత్రను మల్కాజిగిరి ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ ప్రముఖంగా ప్రస్తావించారు.

ఈ సందర్భంగా సౌరవిద్యుత్ ప్లాంటు ప్రారంభోత్స ఫలకం ఆవిష్కరణతోపాటు పర్యావరణ సుస్థిరత-పచ్చదనం పెంపుపై సంస్థ నిబద్ధతకు ప్రతీకగా మొక్కలు నాటే కార్యక్రమం కూడా నిర్వహించారు. అనంతరం ప్రముఖులందరూ సౌరవిద్యుత్ ప్లాంటును సందర్శించి, దానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ప్రయోజనాల గురించి తెలుసుకున్నారు.

పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధిలో ప్రభుత్వ భవిష్యత్ కార్యక్రమాలకు ఈ సౌర విద్యుత్ ప్లాంటు ఒక నమూనాగా నిలుస్తుంది. అలాగే దేశ సుస్థిర ఇంధన భవితకు దోహదం చేయడంలో 'జిఎస్ఐటిఐ' పాత్రకు ఇదొక ఉదాహరణ కాగలదు. అంతేకాకుండా పరిశుభ్ర ఇంధన ఉత్పాదనలో దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా రూపొందించాలనే ప్రధాని మోదీ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లగలదు.

# పాడేరు వైద్య విద్యకు అనువైన ప్రాంతం : కలెక్టర్ దినేష్ కుమార్



అమరావతి, అక్టోబర్ 14: పాడేరు ఒక సురక్షిత ప్రాంతమని, భయాందోళనలు లేకుండా వైద్య విద్యార్థులు విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మెడికల్ విద్యార్థులకు సూచించారు. ఎంబీబీ ఎస్ తరగతులు సోమవారం నుంచి ప్రారంభం అయిన సందర్భంగా జిల్లా కలెక్టర్ వైద్య కళాశాలను ప్రారంభించి, హాజరైన విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.

పాడేరు వైద్య కళాశాలలో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించేందుకు 50 మంది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాలు కల్పించారు. కాగా 42 మంది విద్యార్థులు ప్రవేశం పొంది కళాశాలలో చేరారు. తల్లిదండ్రులతో పాటు వారిని కళాశాలకు ఆహ్వానిం చిన కళాశాల యాజమాన్యం వారితో సమావేశం ఏర్పాటు చేసి ఘనస్వాగతం పలికింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి వైద్య తరగతులు నిర్వహించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులు గత నెల రోజులుగా కష్టపడి అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లు తదితరాలను పూర్తి చేయడం గొప్ప విషయమని కొనియాడారు.

అదేవిధంగా కొంత మంది తల్లిదండ్రులు పాడేరు అంటే వెనుకడుగు వేస్తున్నారని, ఎటువంటి సమస్యలు లేని ప్రశాంతమైన వాతావరణంలో వైద్య విద్యకు అనువైన ప్రాంతం పాడేరు అని కలెక్టర్ పేర్కొన్నారు. 15 ఏళ్ళ క్రితం తీవ్రవాద ప్రభావం ఉండేదని, ప్రస్తుతం తీవ్రవాదుల నుండి ఎటువంటి చర్యలు లేవని తెలిపారు.

చాలా మంది దీనిని రిమోట్ ఏరియా అనుకుంటారని, కానీ రెండు గంటలలో విశాఖపట్నం చేరుకొని ఎక్కడికైనా వెళ్ళగలమని వివరించారు. జిల్లాలో సుమారు 1100 గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించే పనులు జరుగుతున్నాయని, త్వరలో అవి పూర్తి చేస్తామని చెప్పారు.

అత్యంత ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనలు గురికాకుండా వైద్య విద్యను అభ్యసించాలని కోరారు. అన్ని రకాలుగా రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. మరో రెండు మూడు నెలల్లో అన్ని సౌఖర్యాలు పూర్తి స్థాయిలో కల్పించడం జరుగుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఇక్కడ చదువుకున్న వారికి అవుట్ పేషంట్లు, ఇన్ పేషంట్లు అందుబాటులో ఉంటారని, ఇక్కడ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సికిల్సెల్ అనీమియా, మలేరియా లాంటి వ్యాధులతో పాటు ఇతర వ్యాధులు కూడా వస్తాయని, వాటిపై అధ్యయనం చేయడానికి మెడికల్ విద్యార్థులకు అవకాశాలు ఉంటాయని, అదే విధంగా గిరిజన రోగులకు సేవలందించే అవకాశం కలగటం అదృష్టంగా భావించాలని కలెక్టర్ తెలిపారు.

కళాశాలలో ఆయా శాఖల విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, సహాయ ప్రొఫెసర్లు విద్యార్థులను స్వంతంగా భావించి వారి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గిరిజనులు కూడా వారి వారి సంప్రదాయాలతో పాటు ఉన్నత విద్యలను అభ్యసిస్తున్నారని, గిరిజనులు గౌరవప్రదంగా, మంచిగా ఉంటారని కలెక్టర్ తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ గ్రామీణ స్థానిక సంస్థలకు 15 వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని గ్రామీణ స్థానిక సంస్థల (ఆర్ ఎల్ బి) కు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆంధ్ర ప్రదేశ్‌కు రూ 395.5091 కోట్ల అన్‌టైడ్ (షరతులు లేని) గ్రాంట్లు, రూ 593.2639 కోట్ల టైడ్ (షరతులతో కూడిన) గ్రాంట్లు విడుదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ లో అర్హత కలిగిన తొమ్మిది జిల్లా పంచాయతీలు, 615 బ్లాక్ పంచాయతీలు, 12,853 గ్రామ పంచాయతీలకు ఈ నిధులను ఉద్దేశించారు. కాగా, రాజస్థాన్ లో అర్హత కలిగిన 22 జిల్లా పంచాయతీలు, 287 బ్లాక్ పంచాయతీలు, 9,068 గ్రామ పంచాయతీలకు రూ.507.1177 కోట్ల అన్ టైడ్ గ్రాంట్లు, రూ.760.6769 కోట్ల టైడ్ గ్రాంట్లు విడుదలయ్యాయి.

అన్ టైడ్ , టైడ్ గ్రాంట్ ల వినియోగం ద్వారా స్థానిక పాలనకు సాధికారత

వ్యవసాయం, గ్రామీణ గృహనిర్మాణం మొదలుకొని విద్య, పారిశుధ్యం వరకు భారత రాజ్యాంగం పదకొండో షెడ్యూలులోని 29 అంశాల్లో నిర్దిష్ట స్థానిక అవసరాలను తీర్చడానికి పంచాయతీలకు ఈ గ్రాంట్లు ఉపయోగపడతాయి. అయితే ఈ నిధులను జీతభత్యాలు, ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చులకు వినియోగించడానికి వీల్లేదు. పారిశుధ్యం, బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) స్థితి నిర్వహణ, వర్షపునీటి సంరక్షణ, నీటి రీసైక్లింగ్, గృహ వ్యర్థాల శుద్ధి వంటి మౌలిక సేవలపై టైడ్ గ్రాంట్లు దృష్టి సారిస్తాయి.

అట్టడుగు స్థాయి నుంచి క్షేత్రస్థాయి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా సమ్మిళిత వృద్ధి

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 జి ప్రకారం, ఈ నిధులు అత్యవసర సేవలు , మౌలిక సదుపాయాలను నిర్వహించడానికి పంచాయతీలకు అధికారం ఇస్తాయి. మహాత్మాగాంధీ 'గ్రామ స్వరాజ్య' దార్శనికతకు అనుగుణంగా స్థానిక స్వపరిపాలనను పునర్నిర్వచించడానికి, క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతమైన, స్పందనాయుతమైన నాయకత్వాన్ని పెంపొందించడానికి గ్రామపంచాయతీలకు ఈ గ్రాంట్ల కేటాయింపు ఒక ముఖ్యమైన అవకాశాన్ని కల్పించింది. ఈ సాధికారత ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శక సూత్రం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' లో ప్రతిబింబిస్తుంది, ఇది "వికసిత్ భారత్" లక్ష్యాన్ని సాధించడానికి దృఢమైన నిబద్ధతను స్పష్టం చేస్తుంది. స్థానిక పాలనను పెంపొందించడం ద్వారా, ఈ నిధులు భాగస్వామ్య ప్రజాస్వామ్యం గ్రామ స్థాయి పురోగతి పట్ల భారత్ నిబద్ధతను బలోపేతం చేస్తూ, సమ్మిళిత వృద్ధి , సుస్థిర గ్రామీణ అభివృద్ధికి దోహదం చేస్తాయి,

పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ, జల్ శక్తి మంత్రిత్వ శాఖ (తాగునీరు , పారిశుద్ధ్య విభాగం) ద్వారా గ్రామీణ స్థానిక సంస్థల కోసం రాష్ట్రాలకు 15 వ ఆర్థిక సంఘం గ్రాంట్లను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం సిఫార్సు చేస్తుంది, ఆ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ గ్రాంట్‌లను విడుదల చేస్తుంది. కేటాయించిన గ్రాంట్ల ను ఆర్థిక సంవత్సరంలో రెండు విడతలుగా సిఫారసు చేసి విడుదల చేస్తారు.

# కలుషిత నీటితో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం : హరీశ్‌రావు



సంగారెడ్డి, అక్టోబర్ 14: సంగారెడ్డిలో కలుషిత నీటితో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అందోల్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఈ సందర్భంగా విజయరామరాజు, అల్లం నవాజ్ రెడ్డి వంటి ముఖ్య నాయకులను కోల్పోవడం నిజంగా ఎంతో బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీకి చేసిన సేవలను ఎప్పటికీ మర్చిపోమంటూ వారికి నివాళుర్పించారు. అలయ్ బలయ్ పండుగ మన తెలంగాణ ఉద్యమంలో ఎంతో స్ఫూర్తిని నింపిందన్నారు.

పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి, ప్రకృతిని పూజించే పండుగలు మన ఆత్మగౌరవానికి ప్రతీకలన్నారు. అన్ని కులాల వారు కలిసి బతుకమ్మ పండగను పంచుకోవడం, గ్రామాలు అంతా జమ్మి పెట్టుకుని అలయ్ బలయ్ చేసుకోవడం నిజంగా మన సంప్రదాయమన్నారు.

కేసీఆర్ పాలనలో ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంగారెడ్డిలో కలుషిత నీటితో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు.

మిషన్ భగీరథ ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం సురక్షిత నీళ్లు అందించిందని.. కానీ, ఇప్పుడు ఆ పని కూడా సరిగా చేయడంలేదని ఆరోపించారు. రైతుబంధు లేదని.. బతుకమ్మ చీరెలు లేవని.. రుణమాఫీ కూడా జరుగలేదన్నారు. డిసెంబర్ 9, పంద్రాగస్టు కూడా ముగిసిందని.. ఇంకా రుణమాఫీ కాలేదన్నారు. మంత్రులు డిసెంబర్ 9కి రుణమాఫీ చేస్తామని చెబుతున్నారని.. కానీ, ఏడాది కాలం గడిచినా అమలు చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అత్యంత పారదర్శకంగా లాటరి నిర్వహణ : కలెక్టర్ దినేష్ కుమార్




అమరావతి, అక్టోబర్ 14: జిల్లాలో 40 మద్యం షాపుల నిర్వహణకు సోమవారం జరిగిన లాటరి ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. పాడేరులో పది, అరుకులో ఆరు, చింతపల్లిలో ఆరు, రంపచోదవారంలో పది, చింతూరులో ఎనిమిది మొత్తం 40 మద్యం షాపులకు గాను 1205 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

అయితే ఈ రోజు స్థానిక విఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన లాటరిలో గెలుపొందిన వారికి షాపులు కేటాయించడం జరిగిందని, కాగా గెలుపొందిన వారు సకాలంలో డబ్బులు చెల్లించకపోతే తదుపరి గెలుపొందిన వారికి షాపు కేటాయిం చడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో అన్ రిజర్వ్ కేటగిరీ లెకపొయినప్పటికీ పాడేరుకు సంబ ంధించి ఒక షాపుకు ఆన్లైన్ లో దరఖా స్తు చేసుకున్న ఒక గిరిజనేతరునికి లాటరిలో రావడంతో తదుపరి వ్యక్తికి షాపు కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ లాటరీలో సంయుక్త కలెక్టర్ డా.ఎంజే అభిషేక్ గౌడ్, ఎక్సైజ్ సహాయ కమిషనర్ వి. మహేశ్వర్, రంపచోడవరం సహాయ ఎక్సైజ్ పర్యవేక్షకులు నాగ రాహుల్, పాల్గొన్నారు.

# జాయింట్ పార్లమెంటరీ కమిటీ సమావేశాన్ని బహిష్కరించిన విపక్షాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : వక్ఫ్ (సవరణ) బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీ సమావేశాన్ని సోమవారం పలువురు ప్రతిపక్ష ఎంపిలు బహిష్కరించారు. కమిటీ నిబంధనలకు అనుగుణంగా పనిచేయడం లేదని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎంపిలు గౌరవ్ గొగోరు, ఇమ్రాన్ మసూద్, డిఎంకె ఎంపి ఎ. రాజా, శివసేన (యుబిటి) ఎంపి అరవింద్ సావంత్, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసీ, సమాజ్‌వాద్ పార్టీ ఎంపి మొహిబుల్లా, ఆప్ ఎంపి సంజరు సింగ్‌లు ఈ సమావేశాన్ని బహిష్కరించారు.

.తమ తదుపరి కార్యాచరణను నిర్ణయించేందుకు ప్రతిపక్ష సభ్యులు అనంతరం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. లోక్‌సభ స్పీకర్‌ని సంప్రదించవచ్చని ఇద్దరు ఎంపిలు సూచించారు.

బిల్లుని పరిశీలిస్తున్న పార్లమెంట్ జాయింట్ కమిటీ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేయడం లేదని ఎంపి అరవింద్ సావంత్ మీడియాతో పేర్కొన్నారు.

# పవన్ సభలో 'ఓజీ' 'ఓజీ' అంటూ నినాదాల హోరు

-వెంటనే స్పందించిన పవన్ స్టార్
-మీరు ఓజీ అంటుంటే మోదీలా వినిపిస్తుంది..
-వినోదం అందరికి కావాలి
-వినోదాలు.. ఓజీలు. మీరు సినిమాకు వెళ్లాలన్నా
-మంచి రోడ్లు కావాలి.. అవి చూడాలంటే డబ్బులు కావాలి
-అందుకే ముందు మనం కడుపు నింపే పని ప్రారంభించాం
-అందరూ హీరోలు బాగుండాలి
-టాలీవుడ్ హీరోలందరూ నిష్ణాతులే..
-వారందరికీ జై కొట్టాలంటే మన ఆర్థిక పరిస్థితి బాగుండాలి..

అమరావతి, అక్టోబర్ 14: సినిమాలపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కృష్ణాజిల్లా కంకిపాడులో నిర్వహించిన 'పల్లెపండగ' కార్యక్రమంలో అభిమానులు ఓజీ అంటూ నినాదాలు చేయగా ఆయన స్పందిస్తూ,

''మీరు 'ఓజీ.. ఓజీ..' అంటుంటే నాకు 'మోదీ.. మోదీ' అని వినిపించేది. వినోదం అందరికీ కావాల్సిందే. ఈ పల్లె పండగ ఎందుకు చేస్తున్నామో మీకు



చెబుతా. రేపు మీరంతా మీ అభిమాన కథానాయకుల సినిమాలకు వెళ్లాలి. టికెట్ల కోసం డబ్బులు పెట్టాలి అంటే మీ చేతిలో డబ్బులు ఉండాలి. వినోదం కన్నా ముందు ప్రతీ ఒక్కరి కడుపు నిండాలి. అందుకే ముందు కడుపు నింపే పని చేద్దాం. మన రోడ్లు, స్కూల్స్‌ను బాగు చేసుకుందాం. ఆ తర్వాతే విందులు.. వినోదాలు.. ఓజీలు. మీరు సినిమాకు వెళ్లాలన్నా గోతులు లేని రోడ్లు ఉండాలి కదా! నన్ను మీరెలా అభిమానిస్తారో, నాకు కూడా వేరే హీరోలు అంటే ఇష్టమే. ఇండస్ట్రీలో ఉన్న ఏ హీరోలతోనూ ఇబ్బంది లేదు. నేను ఎవరితోనూ పోటీపడను. ఒక్కొక్కరూ ఒక్కో దాంట్లో నిష్ణాతులు. అందరూ బాగుండాలని కోరుకుంటా. బాలకృష్ణ, చిరంజీవి, మహేశ్‌బాబు, తారక్, అల్లు అర్జున్, రామ్‌చరణ్, నాని అందరూ బాగుండాలని కోరుకుంటా. మీ అభిమాన హీరోలకు జై కొట్టేలా ఉండాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుండాలి. ముందు దానిపై దృష్టిపెడదాం" అని అన్నారు.

# వికసిత్ భారత్ దార్శనికతను సాకారం చేసేందుకు వేగాన్ని పెంచుతున్న గతిశక్తికి ధన్యవాదాలు: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : ప్రధాన మంత్రి గతిశక్తి యోజన (జాతీయ మాస్టర్ ప్లాన్) మూడు సంవత్సరాలు పూర్తి చేసుకోవడం పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ చేసిన పోస్ట్ ను, మైగవ్ లోని థ్రెడ్ పోస్ట్ ను షేర్ చేస్తూ ప్రధాన మంత్రి ఇలా పేర్కొన్నారు.

"దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ఉద్దేశించిన పరివర్తనాత్మక కార్యక్రమంగా పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఆవిర్భవించింది. ఇది బహుళ అత్యాధునిక అనుసంధానాన్ని (మల్టీమోడల్ కనెక్టివిటీని) గణనీయంగా పెంచింది, అన్ని రంగాలలో వేగవంతమైన , మరింత సమర్థ మంతమైన అభివృద్ధికి దోహదపడుతోంది."

"వివిధ వ్యవస్థల నిరంతర అనుసంధానం రవాణా సౌకర్యాలు మెరుగు పరచడానికి, జాప్యాన్ని తగ్గించడానికి , అనేక మందికి కొత్త అవకాశాలను సృష్టించడానికి దారితీసింది."

""గతిశక్తికి ధన్యవాదాలు, ఇది వికసిత్ భారత్ దిశగా భారత్ ను వేగంగా అడుగులు వేయిస్తోంది. ఇది పురోగతి, వ్యవస్థాపకత , ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది."

# పల్లె పండుగతో జిల్లాలో రూ.82 కోట్లతో 1562 పనులకు శ్రీకారం- కలెక్టర్

కర్నూలు, అక్టోబర్ 14: "పల్లె పండుగ" కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా రూ.82 కోట్లతో 1562 పనులకు శ్రీకారం చుట్టామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కోడుమూరు నియోజకవర్గంలోని కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఇందిరమ్మ కాలనీలో మంజూరైన రోడ్లు, డ్రైయిన్లు తదితర అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కోడుమూరు ఎంఎల్ఏ బొగ్గుల దస్తగిరి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రూ.4500 కోట్లతో 30 వేలకు పైగా పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతోందన్నారు.

ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో రూ. 82 కోట్లతో 1562 అభివృద్ధి పనులను చేపట్టనున్నామని కలెక్టర్ తెలిపారు. కాగా కోడుమూరు నియోజకవర్గంలో రూ. 12.65 కోట్లతో, కర్నూలు మండలంలో రూ. 4.28కోట్లు, గొందిపర్ల గ్రామంలో రూ.41.62 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని కలెక్టర్ తెలిపారు.. గొందిపర్ల గ్రామంలో రూ.14లక్షలతో 8 ఫామ్ పాండ్స్, రూ.6.15 లక్షలతో ఫీల్డ్ చానల్స్, రూ.12 లక్షలతో సిసి రోడ్స్, రూ. 4.6 లక్షలతో గోకులాలు, ఇతర పనులకు రూ.4 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మహాత్మా



గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొదటి దశలో ఈ పనులను మంజూరు చేయడం జరిగిందన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద మళ్లీ ఏప్రిల్ నెలలో కూడా కొత్తగా పనులు చేపట్టే అవకాశం ఉందని, ఈ విధంగా నిరంతరంగా అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు.

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ "పల్లె పండుగ" కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇద్దరు కలిసి పల్లెలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రమంతటా అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల 500 కోట్ల రూపాయలతో 30 వేల పనులను చేపడుతోందని తెలిపారు.. అలాగే 3 వేల కిలోమీటర్ల సిసి రోడ్లు, 500 కిలోమీటర్ల బిటి రోడ్లను, 25 వేల గోకులాలను, 10 వేల ఎకరాల నీటి సంరక్షణ కందకాలను అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనుందని ఎంఎల్ఏ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో మన రాష్ట్రం అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉందని, ఇప్పటికీ కూడా మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోలేకపోతే భావితరాల భవిష్యత్తు నాశనం అయిపోతుందని, అందుకే ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం ద్వారా పల్లెలను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కొకటిగా పథకాలను అమలు చేసుకుంటూ ముందుకు వెళ్లడం జరుగుతోందని, దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ పథకం కూడా ముఖ్యమంత్రివర్యులు అందజేయనున్నారన్నారు.. కూటమి ప్రభుత్వం రావడం వల్ల తిరిగి రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవడానికి మంచి అవకాశం వచ్చిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, పంచాయితీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డిపిఓ భాస్కర్, సర్పంచ్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# హామీ నిలబెట్టుకోకపోతే ఢిల్లీలో ధర్నా చేస్తా

-100 రోజుల్లో పథకాలన్నీ అమలు చేస్తామన్నారు
-300 రోజులు దాటినా ఒక్క పథకం అందలేదు
-ఇప్పటికే పోస్టు కార్డు ఉద్యమం
-రాహుల్ గాంధీకి ముక్రా- కె. గ్రామస్తుల హెచ్చరిక

ఆదిలాబాద్, అక్టోబర్14 : ఎన్నికల్లో గెలిస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ వీటి గురించి



ఊసెత్తకపోవడం పై ఆదిలాబాద్ జిల్లా ముక్రా.. కె గ్రామస్తులు పోస్టు కార్డు ఉద్యమం ప్రారంభించారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పోస్టు కార్డులు పంపించారు.

కార్డులోని సారాంశం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని రాహుల్ గాంధీ సభాముఖంగా ప్రకటించారు. 300 రోజులు గడిచినా మహాలక్ష్మి పథకం కింద ప్రతినెల మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 సాయం ఇప్పటికీ అమలు కాలేదు. కళ్యాణ లక్ష్మి కింద ఆడపడుచులకు లక్ష రూపాయల తులం బంగారం ఇస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదు. ప్రతి కుటుంబానికి రూ .2 లక్షల రుణమాఫీ అర్హుల దరిచేరలేదు. పెన్షన్ రూ. 4 వేలు, వికలాంగుల పెన్షన్ 6 వేలు, కొత్త రేషన్ కార్డులు ఇప్పటికీ ఊసే లేదు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేరకపోతే గ్రామస్తులంతా ఢిల్లీలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

# క్యాట్‌ను ఆశ్రయించిన బదిలీ ఐఏఎస్‌లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఆదేశాలతో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్లో కొనసాగుతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పునర్విభజన చట్టం ప్రకారం కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు డీఓపీటీ కార్యదర్శి ఆదేశాలు సైతం జారీ చేశారు.

అయితే డీఓపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ పలువురు ఐఏఎస్ అధికారులు క్యాట్ ను నేడు ఆశ్రయించారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, సృజన క్యాట్లో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. తెలంగాణలో కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి కోరారు. ఇదే విధంగా ఏపీలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఐఏఎస్ అధికారిణి సృజన కోరారు. వారి పిటిషన్లపై కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ మంగళవారం విచారణ చేపట్టనుంది.

ఏపీకి కేటాయించి తెలంగాణలో కొనసాగుతున్న వారిలో ఐఏఎస్ అధికారులు వాణీప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి, ప్రశాంతి, ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన వారిలో ఐఏఎస్ అధికారులు సృజన, శివశంకర్, హరికిరణ్ ఉన్నారు. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లాలని దరఖాస్తు పెట్టుకున్న ఎస్.ఎస్.రావత్, అనంతరాము అభ్యర్థనలను డీవోపీటీ తిరస్కరించింది. దీంతో వీరిద్దరూ ఆంధ్రాలోనే కొనసాగుతారు.

# టీకా మందు నియంత్రణలో ప్రపంచ ఆరోగ్య సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలను అందుకున్న భారత జాతీయ నియంత్రణ ప్రాధికార సంస్థ

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : టీకామందులకు సంబంధించిన నియంత్రణ వ్యవస్థ ఎంత పక్కాగా ఉన్నదీ సూచిస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రచురించిన ఒక నివేదికలో, సంబంధిత గీటురాళ్ళకు నేషనల్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏ), ఎన్ఆర్ఏ అనుబంధ సంస్థలతో పాటు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) తుల తూగినట్లు డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. జెనీవా లోని డబ్ల్యుహెచ్ఓ ప్రధాన కేంద్రం (హెచ్‌క్యూ) నిపుణుల నాయకత్వంలో వివిధ దేశాలకు చెందిన అంతర్జాతీయ నిపుణుల బృందం గత నెల 16 నుంచి 20 వరకు భారతదేశం లోని టీకామందుల నియంత్రణ వ్యవస్థను కూలంకషంగా సమీక్షించిన తరువాత ఈ తుది నిర్ణయానికి వచ్చారు.

టీకామందులను అంచనా వేసే ప్రాథమిక అంశాలు మూడింటిలో భద్రత, ప్రభావశీలత్వం, నాణ్యత లు లెక్కకు వస్తాయి. టీకామందుల గుణకారిత్వం విషయంలో హామీని ఇచ్చే ప్రపంచ స్థాయి ప్రమాణాలను కొన్నింటిని డబ్ల్యూహెచ్ఓ నిర్దేశించింది. దీనికోసం కొన్ని సాధనాలను, మార్గదర్శక సూత్రాలను రూపొందించడం, ఎన్ఆర్ఏ కు ప్రమాణాలను నిర్దేశించడం తో పాటు టీకామందుల విషయంలో ఒక ప్రీక్వాలిఫికేషన్ ప్రోగ్రాం ను తీసుకువచ్చింది.

టీకా మందుల నియంత్రణకు భారతదేశంలో అమలవుతున్న వ్యవస్థ ఏ స్థాయిలో ఉన్నదీ అంచనా వేసేందుకు డబ్ల్యూహెచ్ఓ ఎన్ఆర్ఏ కు సరికొత్త ప్రమాణాల (రి-బెంచ్ మార్కింగ్)ను నిర్ధారించింది. అయితే, భారత టీకామందు నియంత్రణ వ్యవస్థ ఈ ప్రమాణాలకు దీటుగా నిలచి, తద్వారా వ్యవస్థలో పరిపక్వ స్థాయిని ప్రదర్శించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ బెంచ్ మార్కింగ్ టూల్ (జీబీటీ) 'ఆరు' తాలూకు అన్ని కీలక నియంత్రణ సంబంధిత కార్యకలాపాల పరంగా చూసినప్పుడు దేశంలో అమలవుతున్న విధానాలు 'ప్రయోజనకరం'గా ఉన్నాయని ప్రకటించారు. జీబీటీ వెర్షన్ '5'ను 2017లో కట్టబెట్టగా, ప్రస్తుతం దానిని సవరించి జీబీటీ '6' కు చేర్చారు. ఈ ప్రక్రియలో భాగంగా ప్రమాణాలలో మరింత కచ్చితత్వాన్ని ప్రవేశపెట్టి, ఉన్నత కొలమానాలను నిర్దేశించారు.

అనేక విధులలో అత్యున్నత స్థాయి మార్కులను భారతదేశం సంపాదించుకొని, పరిపక్వత పరంగా 'మూడో' స్థాయిని నిలబెట్టుకొంది.

ఈ విశిష్ట కార్యసాధనను గురించి కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలీల వాస్తవ మాట్లాడుతూ, "ఈ విషయంలో డబ్ల్యూహెచ్ఓ సహకారంతో సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) ఆదర్శప్రాయమైన కృషిని కనబరచింది. ప్రపంచ వ్యాప్తంగా ఔషధ నిర్మాణ పరిశ్రమలో ప్రధాన పాత్రధారులుగా కొనసాగుతున్న దేశాలలో ఒక దేశంగా భారతదేశం ఉంది. అంతేకాకుండా, తక్కువ ధరలలో టీకా మందులను, జెనరిక్ మందులను సమకూరుస్తున్న దేశంగా కూడా పేరు తెచ్చుకొంది" అన్నారు.

దేశం ఈ ప్రతిష్ఠాత్మక కార్యాన్ని సాధించడంలో కఠోరంగా శ్రమించిన అన్ని బృందాలకు పుణ్య సలీల అభినందనలను తెలియజేశారు. మానవుల ఆరోగ్య పరిరక్షణలో సత్ఫలితాలను మరిన్నింటిని సాధించడానికి నాణ్యమైన ఉత్పాదనలను ప్రపంచమంతటా అందించడంలో దేశ నియంత్రణ వ్యవస్థకు ఉన్న బలాన్ని, నియంత్రణ వ్యవస్థ చేసిన వాగ్దానాన్ని ఆమె పునరుద్ఘాటించారు.

దేశంలో డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ రోడెరీకో హెచ్. ఆఫ్ రన్ ఇలా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు: "ప్రపంచంలో వివిధ దేశాలు వాటి నియంత్రణ వ్యవస్థలను పటిష్ఠపరచుకోవడంలోను, నాణ్యతతో కూడిన, సురక్షితమైన, ప్రభావశీలమైన, తక్కువ ధరలకు దొరికే మందులను ఎలాంటి వివక్షకు తావు లేకుండా ప్రజలందరి చెంతకు చేర్చడంలోను ఒక ముఖ్య పాత్రను డబ్ల్యూహెచ్ఓ పోషిస్తున్నది. ఇది నిజంగానే ఒక మహత్కార్య సాధన; మరి మేం ఆరోగ్య- కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు, ఆ శాఖకు అనుబంధంగా పని చేస్తున్న సంస్థలకు అభినందనలను తెలియజేస్తున్నాం."

ఆరోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ (ఎమ్ఓహెచ్ఎఫ్‌డబ్ల్యూ) ఆధ్వర్యంలో పని చేస్తున్న సీడీఎస్‌సీఓ లో డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ (ఇండియా) బాధ్యతలను నిర్వర్తిస్తున్న డాక్టర్ రాజీవ్ సింగ్ రఘువంశీ తన అభిప్రాయాన్ని ఈ కింది విధంగా తెలియజేశారు:

"పెద్ద ఎత్తున టీకా మందులను ఉత్పత్తి చేస్తున్న దేశాలలో భారతదేశం ఒకటిగా ఉంది. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితి ఏజెన్సీలకు ('యూనిసెఫ్', 'డబ్ల్యూహెచ్ఓ', 'పీఏహెచ్ఓ'లకు) అనేక రకాల టీకామందులను అందిస్తోంది "టీకామందులను నియంత్రించే పనిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎన్ఆర్ఏ సూచికల తాలూకు ప్రమాణాలను నేషనల్ రెగ్యులేటరీ ఆథారిటీ ఆఫ్ ఇండియా అందుకొన్నది."

అంతర్జాతీయ కొలమానం తాలూకు సానుకూల ఫలితాన్ని డబ్ల్యూహెచ్ఓ లో ఎన్ఆర్ఏ రీ-బెంచ్‌మార్కింగ్ విభాగంలో జట్టు నాయకుడుగా ఉన్న డాక్టర్ అలీరెజా ఖాదిమ్ స్వాగతించారు. ఆయన మాట్లాడుతూ, "భారతదేశం తన ఔషధ నిర్మాణ రంగం, ఔషధ నియంత్రణ సామర్థ్యంల పరంగా పరిపుష్టిని పునరుద్ఘాటించడంలో అమిత ప్రభావాన్ని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. భారతదేశ జాతీయ నియంత్రణ ప్రాధికార సంస్థ కు గత అనేక సంవత్సరాలుగా డబ్ల్యుహెచ్ఓ తన సాంకేతికపరమైన సామర్థ్యాన్ని పెంచుకుంటూ వస్తోంది. ఈ సాఫల్యం టీకామందుల నియంత్రణ సామర్థ్యాన్ని బలపరచేందుకు ఒక మార్గసూచీ ప్రకారం ముందుకు పోవడంలో డబ్ల్యుహెచ్ఓ సహకారాన్ని తీసుకొంటూ, సీడీఎస్‌సీఓ తో సమన్వయాన్ని నెలకొల్పుకొంటూ ఆరోగ్య మంత్రిత్వ శాఖ చేసిన తీవ్ర కృషికి దక్కిన ఫలం" అని కూడా అన్నారు.

టీకామందులను ఉత్పత్తి చేస్తున్న ప్రధాన దేశాలలో భారత్ ఒకటి. భారత్ లో టీకామందును ఉత్పత్తి చేస్తున్న సదుపాయాలు 36 ఉన్నాయి. ఇక్కడ ఉత్పత్తి చేస్తున్న వేక్సీన్ లను దేశవ్యాప్తంగాను, అతర్జాతీయ మార్కెట్ లోను (150 దేశాలలో) ఉపయోగిస్తున్నారు. ఇది ప్రపంచ దేశాలకు ఒక ప్రధాన వేక్సీన్ సరఫరాదారు దేశంగా భారత్ కు పేరుప్రఖ్యాతులను తెచ్చిపెట్టింది.

భద్రతలో, ప్రభావశీలత్వంలో, నాణ్యతలో ఏకీకృత ప్రమాణాలకు దీటుగా రూపొందిన టీకామందులను అందరి అందుబాటు లోకి తీసుకు రావాలన్నదే డబ్ల్యూహెచ్ఓ ప్రీక్వాలిఫికేషన్ ప్రోగ్రామ్ (పీక్యూపీ) లక్ష్యం. ఐక్యరాజ్య సమితి ద్వారా కొనుగోళ్ళు జరిపే దేశాలకు టీకామందులను సరఫరా చేసే తయారీదారు సంస్థలు పీక్యూపీ ని తు.చ. తప్పక పాటించవలసి ఉంటుంది. టీకామందుల విషయంలో డబ్ల్యూహెచ్ఓ ప్రీక్వాలిఫికేషనును పొందాలి అంటే ఎన్ఆర్ఏ ప్రాతినిధ్యం లభించాలి.

ఎన్ఆర్ఏ ప్రమాణాలన్నిటి విషయానికి వస్తే, నియంత్రణ సామర్థ్యం పరంగా అందుకొన్న ప్రయోజనాలను దీర్ఘకాలం పాటు నిలబెట్టుకొంటూ ఉండడమనేది కీలకం అవుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని, భారతదేశంలో ఈ మధ్య మదింపును పూర్తి చేసిన నిపుణుల బృందం ఒక సమగ్ర సంస్థాగత అభివృద్ధి ప్రణాళికకు రూపకల్పన చేసింది. ఈ ప్రణాళిక, రాబోయే సంవత్సరాలలో భారతదేశంలో నియంత్రణ సామర్థ్యాన్ని మరింతగా పెంపొందింప చేసుకోవడానికి అమలు పరచవలసిన అదనపు కార్యకలాపాలను సూచిస్తుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ తన మదింపు కార్యక్రమంలో భాగంగా సీడీఎస్‌సీఓ, రాష్ట్రాల ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థలు, కసౌలీలోని కేంద్రీయ ఔషధ ప్రయోగశాల కేంద్రం స్థాయిలోను, రాష్ట్రాల స్థాయిలోను టీకామందులను ఇప్పించిన తరువాత ఎదురైన ప్రతికూల ఘటనలు (ఏడ్ వర్స్ ఈవెంట్స్ ఫాలోయింగ్ ఇమ్యూనైజేషన్..'ఏఈఎఫ్ఐ'); ఇమ్యూనైజేషన్ డివిజన్, ఫార్మకోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా ల పనితీరును, ఇంకా టీకామందుల నియంత్రణ, క్రమబద్ధీకరణ, పరీక్షలను జరపడం అనే కార్యకలాపాలలో నిమగ్నమైన ఇతర సంబంధిత సంస్థల పనితీరును కూడా బేరీజు వేసింది.

# ముధోల్ మార్కెట్ యార్డు , గోదాంకు స్థలం కేటాయించండి



ఆదిలాబాద్, అక్టోబర్14 : ముధోల్ రైతులకి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు , గోదాం సమస్యల శాశ్వత పరిష్కారానికి స్థలం కేటాయించాలని తహశీల్దార్ శ్రీకాంత్ కు ముధోల్ రైతు సంక్షేమ సంఘం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముధోల్ రైతు సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘానికి స్థల కేటాయింపు ద్వారా గోదాం నిర్మించుటకు మార్గం సుగమమై రైతులకు మేలు జరిగుతోందన్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యధిక సోయా సాగుభూమి ముధోల్ తాలూకా కేంద్ర పరిసరాల్లో ఉన్న దృష్ట్యా , అలాగే ముధోల్ , తానూర్ , బాసర , లోకేశ్వరం నాలుగు మండలాలకు భౌగోళికంగా ముధోల్ కేంద్ర బిందువుగా ఉండటం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఏర్పాటు కు అనుకూలమని పేర్కొన్నారు. దళా రుల బారిన పడి రైతులు నష్టపోకుం డా ఉండేందుకు రైతుల దశాబ్దాల డిమాండ్ కూడా నెరవేరే అవకాశమని తెలియజేసారు. నూతన వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు ప్రాధాన్యతను గ్రహించిన తహసీల్దార్ తప్పకుండ రైతులకు మేలుకొ రకు స్థలాన్ని కేటా యించేవిషయమై పరిశీలన చేస్తామని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్ , గ్రామ సంఘ అధ్యక్షులు గుంజాల నారాయణ , క్యాషియర్ సాయినాథ్ మేత్రి , మాజీ సర్పంచ్ రాజేందర్ వెంటాపూర్ , వందేమాతరం, జాదవ్ సాయినాథ్ పాటిల్ , యువ రైతులు బొడ్డోల్ల శివాజీ , గుడ్లోల్ల దేవేందర్ , గోపి , రాజేష్ జాదవ్ , పోతన్న , శంకర్ లు, పాల్గొన్నారు.






# ఎల్ఎస్ఏఎమ్ 12 (యార్డ్ 80) జల ప్రవేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : భారతీయ నౌకాదళం కోసం విశాఖపట్నం లోని ఎమ్ఎస్ఎమ్ఇ షిప్ యార్డ్- మెసర్స్ సీకాన్ ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ (ఎస్ఈపీ) నిర్మించిన పెద్ద నావ (బార్జ్)- ఎల్ఎస్ఏఎమ్ 12 (యార్డ్ 80)ని జల ప్రవేశం చేసింది. 'మిసైల్ కమ్ ఎమ్యునిషన్ బార్జ్ ప్రాజెక్టులోని ఎనిమిది నావల్లో ఇది ఆరోది. నిన్న మహారాష్ట్రలోని మిరాభయందర్ ప్రాంతంలో గల- వినాయగా మెరైన్ పెట్రో సంస్థ- జల ప్రవేశ ప్రదేశంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నావ జల ప్రవేశ కార్యక్రమానికి కొమోడర్ ఎమ్.వీ. రాజ్ కృష్ణ, సీఓవై (ఎమ్‌బీఐ) అధ్యక్షత వహించారు.

క్షిపణి, మందుగుండు సామానుల రవాణాకు ఉద్దేశించిన మొత్తం ఎనిమిది నావల నిర్మాణానికి రక్షణ మంత్రిత్వ శాఖ, ఎస్ఈసీఓఎన్ ఇంజినీరింగ్ ప్రాజెక్టుల సంస్థ 2021 ఫిబ్రవరి 19న ఒక ఒప్పందాన్ని చేసుకున్నాయి. ఈ నావలు భారతీయ నౌకాదళ వేదికల వద్ద రేవు కట్టలు, ఇంకా ఔటర్ హార్బర్లలో రవాణాను, సరకులను ఎక్కించడాన్ని, సరకులను దించడాన్ని సులభతరం చేసే సేవలను అందించడం ద్వారా భారతీయ నౌకాదళానికి నిర్వహణ సంబంధిత బాధ్యతలను పూర్తి చేయడంలో ఈ తరహా నావలు తోడ్పడనున్నాయి.

ఈ నావలను ఇండియన్ రిజిస్ట్రర్ ఆఫ్ షిపింగ్ లోని సంబంధిత సముద్ర చట్టాలు, నిబంధనలను అనుసరిస్తూ దేశీయంగా తీర్చిదిద్ది ఈ నావల్ని తయారు చేస్తున్నారు. నావ నమూనా తయారీ దశలోనే విశాఖపట్నంలోని నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లాబొరేటరీలో ప్రయోగాత్మకంగా పరీక్షించారు. భారత ప్రభుత్వ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం విజయవంతమైందని చెప్పడానికి ఈ నావలు ఒక ఉదాహరణగా నిలుస్తాయి.



# రోడ్డు, విమానయాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అంచనా వేసిన వ్యవస్థల నిర్మాణ ప్రణాళికా బృందం

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) అదనపు కార్యదర్శి శ్రీ రాజీవ్ సింగ్ ఠాకూర్ అధ్యక్షతన పీఎం గతిశక్తి విభాగమైన వ్యవస్థల నిర్మాణ ప్రణాళికా బృందం (నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్- ఎన్‌పీజీ) 81వ సమావేశం నిన్న జరిగింది. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖలకు చెందిన అయిదు ప్రధానమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల మదింపుపై ఈ సమావేశం దృష్టి సారించింది. పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ (ఎన్ఎంపీ)లో పేర్కొన్న అంతర్గత ప్రణాళికా సూత్రాలకు అనుగుణంగా ప్రాజెక్టులను మదింపు చేశారు. వీటి అంచనా ప్రభావాలు, మూల్యాంకనాన్ని ఈ కింది విధంగా ఉంది.

ఉత్తర ప్రదేశ్‌లోని బృందావన్ బైపాస్

ఉత్తర ప్రదేశ్‌లో 44వ జాతీయ రహదారిని, యమునా ఎక్స్‌ప్రెస్‌ను కలుపుతూ 16.75 కిమీల బృందావన్ బైపాస్ గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టును నిర్మించనున్నారు. 44వ జాతీయ రహదారికి, యమునా ఎక్స్‌ప్రెస్ ల మధ్య ప్రత్యక్ష మార్గాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బృందావన్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. ప్రయాణ సమయం 1.5 గంటల నుండి 15 నిమిషాలకు తగ్గుతుంది. దీని నిర్మాణం ద్వారా ఈ ప్రాంతంలో అనుసంధాన సేవలు పెరగడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, పారిశ్రామిక వృద్ధిని ప్రభావితం చేస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత, ప్రాంతీయ సౌలభ్యాన్ని మెరుగుపరచడంతో పాటు సామాజిక-ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించనుంది.

మధ్యప్రదేశ్ లోని సందల్పూర్-బడీ రహదారి

మధ్యప్రదేశ్‌లో 146బీ జాతీయ రహదారిలో భాగంగా సందల్పూర్-బడీ రోడ్డు మార్గంలో 142.26 కి.మీ. మేర 4 లైన్ల రహదారిని నిర్మించనున్నారు. ఇదొక గ్రీన్ ఫీల్డ్/ బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టు. ఇండోర్, జబల్‌పూర్ మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడం, ట్రాఫిక్ కష్టాలు లేకుండా చేయడం, ముఖ్యంగా భోపాల్ లో రద్దీని తగ్గించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రస్తుత ప్రతిపాదిత మార్గం వివిధ జాతీయ రహదారులను, వివిధ ఆర్థిక, పర్యాటక ప్రాంతాలను కలుపుతూ కీలకమైన అనుసంధాన రోడ్డు మార్గంగా పనిచేస్తుంది. అంతిమంగా ఈ ప్రాంతంలో సామాజిక ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

మహారాష్ట్రలోని జున్నార్-తలేఘర్ రోడ్డు మార్గం

మహారాష్ట్రలోని పుణేలోని జున్నార్ నుంచి తలేఘర్ వరకు 55.94 కిలోమీటర్ల రహదారిని ఆధునీకరించే బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టు ఇది. భీమాశంకర్, జున్నార్, బంకర్‌ఫతా, ఎన్‌హెచ్-61 మధ్య అనుసంధానాన్ని పెంచడం, సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్యోద్దేశం. ఈ రహదారి అధునీకీకరణ భీమాశంకర్ (ప్రధాన పుణ్యక్షేత్రం) జున్నార్ (చరిత్రాత్మక శివనేరి కోటకు నిలయం) వంటి ప్రాంతాలలో పర్యాటకాన్ని పెంచుతుందని అంచనా.

మహారాష్ట్రలోని భీమాశంకర్ - రాజ్ గురునగర్ రహదారి

మహారాష్ట్రలోని పుణేలో 60.45 కిలోమీటర్ల మేర రహదారి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టు. భీమాశంకర్, రాజ్ గురునగర్ మధ్య అనుసంధానాన్ని మెరుగుపర్చడం ద్వారా, సరుకు రవాణా, ప్రయాణికుల రవాణా సులభతరం అవుతుంది. తద్వారా ఆర్థిక కార్యకలాపాలు, మార్కెట్లకు చేరుకోవడం వేగవంతం అవుతుంది. అంతేకాక, ఈ ప్రాజెక్టు మార్గంలోని మారుమూల ప్రాంతాలు సైతం విద్య, ఆరోగ్య సేవలు పొందడం సులభతరం అవుతుంది. మెరుగైన రహదారి మౌలిక సదుపాయాలు- ప్రయాణ సమయాన్ని, ఖర్చును తగ్గిస్తాయి. వ్యాపార ప్రయోజనాలు కూడా నెరవేరుతాయి. ఈ ప్రాంతం మొత్తం సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను నేరవేర్చుతుంది.

జమ్మూకాశ్మీరులోని బద్గాంలో కొత్త ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్, అనుబంధ మౌలిక సదుపాయాల అభివృద్ధి

జమ్మూకాశ్మీర్ బద్గాంలోని శ్రీనగర్ విమానాశ్రయంలో కొత్త ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం, అనుబంధ మౌలిక సదుపాయాల నిర్మాణంతో కూడిన బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు విస్తరణ ద్వారా 71,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో కొత్త టెర్మినల్ భవనాన్ని నిర్మిస్తారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే 2,900 గంటలపాటూ, ఏడాదికి కోటి మంది ప్రయాణికులను తీసుకునే సామర్థ్యం దీనికి ఉంటుంది. అదనంగా నూతన పార్కింగ్ ప్రాంతాల విస్తరణ, నగరం వైపు పార్కింగ్ సౌకర్యాలు, ఏఏఐ సిబ్బందికి, సీఐఎస్ఎఫ్ ల కోసం నివాస సముదాయాల నిర్మాణాన్నీ చేపట్టనున్నారు.

పీఎం గతిశక్తి సూత్రాల ప్రకారం ఎన్పీజి మొత్తం అయిదు ప్రాజెక్టులనూ క్షుణ్ణంగా విశ్లేషించింది.

ఈ ప్రాజెక్టులలో భాగంగా బహుళార్థ సాధక మౌలిక సదుపాయాల సమగ్రాభివృద్ధి, ఆర్థిక, సామాజిక ప్రాంతాలలో చిట్టచివరి వరకు అనుసంధానత, వివిధ రూపాలలో/మార్గాల అనుసంధానత లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించనున్న ఈ ప్రాజెక్టులు, గణనీయమైన సామాజిక-ఆర్థిక ప్రయోజనాలను, ప్రజలకు జీవన సౌలభ్యాన్నీ అందించనున్నాయి. తద్వారా ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని అంచనా.

# లావో పీడీఆర్ ప్రధానిని కలిసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు వియాంటియాన్‌లో లావో పీడీఆర్ ప్రధాని శ్రీ సోనెక్సే సిఫాండోన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 21వ ఆసియాన్-ఇండియా, అలాగే 19వ తూర్పు ఆసియా సదస్సులను విజయవంతంగా నిర్వహించినందుకు లావో ప్రధానిని ఆయన అభినందించారు.

భారత్-లావోస్ మధ్య చారిత్రక, సమకాలీన ఒప్పందాలను మరింత బలోపేతం చేయడంపై ఇరువురు ప్రధానులు నిర్వహించిన చర్చలు ఫలవంతం అయ్యాయి. అభివృద్ధి భాగస్వామ్యం, సామర్థ్యాలను పెంపొందించడం, విపత్తు నిర్వహణ, పునరుత్పాదక ఇంధనం, వారసత్వ పునరుద్ధరణ, ఆర్థిక సంబంధాలు, రక్షణ సహకారం, ప్రజా సంబంధాల వంటి రంగాలలో ద్వైపాక్షిక సహకారం గురించి వారు చర్చించారు. యాగీ టైఫూన్ తర్వాత లావో పీడీఆర్‌కు వరద సాయం అందించినందుకు ప్రధాని సిఫాండోన్ భారత ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం వాట్ ఫౌ పునరుద్ధరణ, పరిరక్షణ కోసం భారత ఆర్కియాలజికల్ సర్వే (ఏఎస్ఐ) సంస్థ ద్వారా భారత్ అందిస్తున్న సాయం ద్వైపాక్షిక సంబంధాలలో ప్రత్యేకమైనదిగా ఇరు దేశాల నాయకులూ పేర్కొన్నారు.

ప్రాంతీయ, బహుపాక్షిక వేదికలలో ఇరు దేశాల మధ్య సన్నిహిత సహకారం పట్ల ఇరువురు ప్రధానులు సంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై భారత్ కీలక పాత్రను పోషిస్తోందని లావోస్ ప్రధాని సిఫాండోన్ అన్నారు. ఆసియాన్-2024 అధ్యక్షత విషయంలో లావో పీడీఆర్‌కు భారత్ అందించిన మద్దతు మరువలేనిదన్నారు.

చర్చల అనంతరం రక్షణ, ప్రసార, కస్టమ్స్ సహకారం వంటి రంగాలలో, అలాగే మెకాంగ్-గంగా సహకారంలో భాగంగా మూడు సత్వర ప్రభావ ప్రాజెక్ట్ (క్యూఐపీలు) లకు సంబంధించిన అవగాహన ఒప్పందాలపై ఇరువురు ప్రధానుల సమక్షంలో ఇరుదేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. లావో రామాయణ్ వారసత్వ పరిరక్షణ, రామాయణానికి సంబంధించిన కుడ్యచిత్రాలు గల వాట్ పాకియా బౌద్ధ దేవాలయ పునరుద్ధరణ, చంపాసక్ ప్రావిన్స్‌లోని రామాయణ్ ప్రదర్శించే షాడో పప్పెట్రీ థియేటర్‌కు అందించాల్సిన మద్దతు గురించి ఈ మూడు క్యూఐపీలు రూపొందించారు. ఈ మూడు క్యూఐపీలలో ప్రతి దానికీ భారత ప్రభుత్వం సుమారు 50,000ల అమెరికన్ డాలర్ల చొప్పున ఆర్థిక సాయం అందించనుంది. లావో పీడీఆర్ పోషకాహార భద్రతను మెరుగుపరచడానికి భారత్ సుమారు ఒక మిలియన్ అమెరికన్ డాలర్ల సాయాన్ని కూడా అందిస్తుంది. భారత్ యూఎన్ అభివృద్ధి భాగస్వామ్య నిధి ద్వారా ఈ సాయాన్ని అందించనున్నారు. ఆగ్నేయాసియాలో ఈ నిధి ద్వారా సహాయం పొందనున్న మొదటి ప్రాజెక్ట్ ఇది.

# తిరుమలలో భారీ వర్షాలు.. 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన టీటీడీ

తిరుపతి, అక్టోబర్ 14 : తిరుపతితో పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే మూడురోజులు వర్షాలు తప్పవని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 16న తిరుమల, తిరుపతితో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది. సోమవారం టీటీడీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. ఇందులో కీలక నిర్ణయం తీసుకున్నది. భారీ వర్షాలతో పాటు భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకొని బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ క్రమంలో మంగళవారం ఎలాంటి సిఫారసుల లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని దేవస్థానం విజ్ఞప్తి చేసింది.

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని టీటీడీ ఈవో శ్యామల రావు ఆదేశించారు. విపత్తు నిర్వహణ ప్రణాళికపై టీటీడీ అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరితో కలిసి ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. 48 గంటల్లో తిరుపతిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరూ విపత్తును ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. 2021లో భారీ కొండ చరియలు విరిగి పడిన ఘటనతో టీటీడీ 700 పేజీల విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈ ప్రణాళిక బాగుందనీ, మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. ఈఓ స్థాయిలో విపత్తుల నివారణ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అడిషనల్ ఈఓ ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సమన్వయ కమిటీ ఉందన్నారు.

అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, విజిలెన్స్ విభాగం, ఇతర కీలకమైన శాఖల విభాగాధిపతులు, తమ సిబ్బందితో డిజాస్టర్ మేనేజ్మెంట్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలనీ, ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ శాఖ విద్యుత్ అంతరాయ పరిస్థితిల్లో జనరేటర్లు నడిపేందుకు ముందస్తు జాగ్రత్తగా తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఐటీ విభాగం భక్తులకు వసతి, దర్శనం, ప్రసాదాల కార్యాకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రజా సంబంధాల విభాగం వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఎస్వీబీసీ, మీడియా, టీటీడీ సోషియల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ భక్తులను అప్రమత్తం చేయాలని సూచించారు.

# 'అలయ్ బలయ్' తెలంగాణ ఉద్యమంలో ఎంతో స్ఫూర్తిని నింపింది : హరీశ్ రావు




హైదరాబాద్, అక్టోబర్ 14 : తెలంగాణ ఉద్యమంలో ఎంతో స్ఫూర్తిని రేపింది అలయ్ బలయ్ కార్యక్రమం. పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ సొంతమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా అందోల్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విజయరామరాజు, అల్లం నవాజ్ రెడ్డి వంటి ముఖ్య నాయకులు కోల్పోవడం బాధగా ఉందన్నారు.

వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దసరాకి గ్రామం గ్రామం అంతా జమ్మి పెట్టుకుంటూ అలయ్ బలయ్ తీసుకునే గొప్ప సంస్కృతి కేసీఆర్ పాలనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగిందన్నారు. కానీ, నేడు పండుగ పూట సంగారెడ్డిలో కలుషిత నీళ్లు తాగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మేము మిషన్ భగీరథ ద్వారా సురక్షిత నీళ్లు ఇస్తే, అది కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతనవడం లేదని మండిపడ్డారు.

రైతుబంధు లేదు, బతుకమ్మ చీరెలు లేవు, రుణమాఫీ కాలేదు. డిసెంబర్ 9 పోయింది, పంద్రాగస్టు పోయిందని విమర్శించారు. నిన్న మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. డిసెంబర్ 9 కి రుణమాఫీ పూర్తి చేస్తాం అంటున్నాడు. ఏడాది కాలం గడిపారు. ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు అన్నారు. కేసీఆర్ ఇచ్చినవే ఇచ్చి డబ్బా కొట్టుకున్నారని విమర్శించారు. మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వానికి తెలంగాణ రాష్ట్రం నిదర్శనం అన్నారు.

# కృషి పట్టుదల ఉంటే ఏదైనా.. ఎఎంవీఐ సొంతం..

## -3 యూనిఫాం సర్వీసు ఉద్యోగులకు ఎంపిక

ఆదిలాబాద్, అక్టోబర్14 : కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని ఓ మహాకవి పాట రాసిన చందంగా.కృషి,పట్టుదల ఉంటే సాధించలేనిదంటూఉండదని నిరూపించారు.3 యూనిఫామ్ సర్వీస్ ఉద్యోగాలను కైవసం చేసుకుని,చివరకు రాష్ట్ర రవాణా శాఖలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టరుగా ఎంపికైన బేర పృథ్వీరాజ్ వర్మ.అతను మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని కన్నెపల్లికి చెందిన బేర రాజమౌళి, శ్రావణి దంపతుల పెద్ద కుమారుడు. పృధ్వీరాజ్ వర్మ చిన్నప్పట్నుంచి మంచి మార్కులతో చక్కగా చదువుకుంటూ యూనిఫామ్ సర్వీసులో ఉద్యోగం చేయాలని సదుద్దేశంతో 3 యూనిఫామ్ ఉద్యోగాలు సాధించారు.అతను ప్రస్తుతం జన్నారం మండలంలోని ఇందనపల్లిలో నివాసముంటూ నిర్మల్ జిల్లా ఉద్యోగంలో చేరి పనిచేస్తున్నారు.పృధ్వీరాజ్ ఒకటి నుంచి 10వ తరగతి వరకు లక్షెట్టిపేటలోని ట్రినిటీ హైస్కూల్లో, ఆ తర్వాత వరంగల్ లోని కాకతీయ యూనివర్సిటీలో బీటెక్ పూర్తిచేశారు.2019లో ఫారెస్ట్ బీట్ ఆఫీసరుగాను, 2023లో తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీసు కానిస్టేబుల్ గాను ఎంపికయ్యారు.అతను 2023 జులై 28న టీఎస్పీఎస్సీ పరీక్ష రాయగా,తాజాగా ఫలితాలను ప్రకటిస్తూ ఈనెల10న జాబితాను టీఎస్పీఎస్సీ వెబ్సైట్లో పెట్టారు.అందులో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు, మల్టీజోనులో 2వ ర్యాంకు పొంది, రాష్ట్ర రవాణా శాఖలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టరుగా ఉద్యోగం సాధించారు.ఈ మేరకు ఉద్యోగ నియామక పత్రాన్ని అతను అందుకోనున్నారు.ప్రస్తుతం పనిచేస్తున్న అటవీ బీటాధికారి ఉద్యోగానికి రాజీనామా చేయనున్నారు.ఆయన మాట్లాడుతూ,అటవీ శాఖ ఉన్నతాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు.ఈ సందర్భంగా అతన్ని మిత్రులు, శ్రేయోభిలాషులు,బంధువులు అభినందించారు.

దుంపూర్ రేంజులోని రాంపూర్ లో అటవీ బీటాధికారిగా పనిచేస్తున్నారు.

అతని తమ్ముడు బేర భరద్వాజ్ వర్మ జగిత్యాల జిల్లా రాష్ట్ర రోడ్డు,భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా ఇటీవల ఉద్యోగంలో చేరి పనిచేస్తున్నారు.

# పండుగ నేపథ్యంలో పటిష్ట పహారా.. సైబరాబాద్‌లో పెరిగిన రాత్రి గస్తీ

హైదరాబాద్, అక్టోబర్ 14 : పండుగ నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన పోలీసు పహారా ఏర్పాటు చేశారు. దసరా, సంక్రాంతి పండుగ సమయాల్లో నగరం నుంచి దాదాపు 60 శాతం మంది తమ తమ సొంత ఊళ్లకు వెళ్తుంటారు. అదే అవకాశంగా తీసుకుంటున్న నేరగాళ్లు తాళాలు వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకుని దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతుంటారు. ఇలాంటి నేరాలను ప్రతి దసరా, సంక్రాంతి సమయాల్లో చూస్తుంటాం.

అయితే, గత కొనేండ్లుగా దొంగతనాలను కట్టడి చేస్తున్న పోలీసులు.. ఈసారి కమిషనరేట్ పరిధిలో ఎలాంటి దోపిడీ, దొంగతనాలకు అవకాశం లేకుండా పటిష్ట నిఘా పెట్టారు. పండుగకు ముందే ప్రజలకు పలు సూచనలు జారీ చేశారు. ఊళ్లకు వెళ్లేవారు స్థానిక ఠాణాల్లో సమాచారం ఇవ్వాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వంటి సూచనలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈనెల 11నుంచి కమిషనరేట్‌లోని అన్ని ఠాణాల పరిధిలో ప్రత్యేక నిఘా బృందాలను రంగంలోకి దింపినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

### రాత్రి సమయాల్లో ప్రత్యేక గస్తీ..

రోజువారీ పోలీసు గస్తీకి అదనంగా దసరా పండుగ సందర్భంగా రాత్రి సమయాల్లో కాలనీలు, బస్తీల్లో ప్రత్యేకంగా పాట్రోలింగ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కొత్తగా ఏర్పడుతున్న కాలనీలు, బస్తీలు, తక్కువ జనం ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సైబరాబాద్ క్రైమ్ విభాగం అధికారులు తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో స్థానిక పోలీసు స్టేషన్ నుంచే కాకుండా ఏసీపీ, డీసీపీ స్థాయి అధికారులకు సంబంధించిన టీమ్‌లు, సీసీఎస్, ఎస్ఓటీ బృందాలు కూడా గస్తీ తిరుగుతూ నిఘా పెట్టాయి. సీసీ కెమెరాలు లేని కాలనీల్లో ప్రత్యేక నిఘా పెట్టి అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

### పాత నేరస్థుల కదలికలపై నిఘా..

దోపిడీ, దొంగతనాలకు సంబంధించి పాత నేరస్థుల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. పండుగ సందర్భంగా చెడ్డీ గ్యాంగ్, థార్ గ్యాంగ్ వంటి దొంగల ముఠాల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

దసరా పండుగ నేపథ్యంలో ఈసారి దొంగతనాలు, దోపిడీలను పూర్తిగా అరికట్టే విధంగా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఠాణాల వారీగా సంబంధిత సెక్టార్ ఎస్ఐలు ఖచ్చితంగా పెట్రోలింగ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అంతే కాకుండా.. డివిజినల్, జోనల్ స్థాయి అధికారులు సైతం గస్తీ నిర్వహించడంతో పాటు స్థానిక స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

# రాబోయే పోరాటానికి ఆయుధ పూజ చేశాడు హరీష్ రావు : రసమయి బాలకిషన్




సంగారెడ్డి, అక్టోబర్ 14: ఇవాళ చేసింది జమ్మి పూజ కాదు.. రాబోయే పోరాటానికి హరీశ్‌రావు ఆయుధ పూజ చేశారు అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. రాదనుకున్న తెలంగాణనే సాధించాం.. వచ్చిన తెలంగాణను కాపాడుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాటం చేయాలని రసమయి పిలుపునిచ్చారు. అందోల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో రసమయి బాలకిషన్ పాల్గొని ప్రసంగించారు.నా చిన్నతనం అంతా జోగిపేటలోనే సాగింది. స్థానికులతో ఆత్మీయ సంబంధాలు ఉన్నాయి. ఎంతో తిప్పలువడి తెలంగాణ సాధించుకున్నాం. ఇవాళ ఉద్యమ రోజులు మళ్లీ గుర్తుకు వస్తున్నాయి. బతుకమ్మ పండుగకు కేసీఆర్ బతుకమ్మ చీరలు పంపిణీ చేసేవారు. గత పదేండ్లలో దసరా, బతుకమ్మ పండుగలను గొప్పగా నిర్వహించుకున్నాం. ఇవాళ ఆ రోజుల్లేవు. ఈ ఏడాది బతుకమ్మ చీరలు ఇవ్వలేదు. ఇప్పుడు వాళ్లే కట్టుకుంటున్నారని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి రసమయి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

అలయ్ బలయ్ సందర్భంగా ఇవాళ జరిగింది జమ్మి చెట్టుకు పూజ కాదు. తెలంగాణ సాయుధ పోరాటానికి హరీశ్‌రావు ఆయుధ పూజ చేసిండు. ఈ ఆయుధాలను మళ్లా పట్టుకుందాం.. విడిచిపెట్టేది లేదు. రాదనుకున్న తెలంగాణనే సాధించాం. వచ్చిన తెలంగాణ కోసం కొట్లాడాలి. ఈ ఒక్క ఊరిలోనే దుఃఖం లేదు.. అన్ని ఊర్లలో ప్రజలు దుఃఖంతో ఉన్నారు. తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఎవరితోనైతే కొట్లాడి తెలంగాణను సాధించామో.. ఇప్పుడు వాన్ని వెళ్లగొట్టే వరకు ఒక్కటిగా నిలబడాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. భూమి సూర్యుని చుట్టు తిరుగుతున్నట్టు.. హరీశ్‌రావు తెలంగాణ చుట్టు తిరుగుతున్నాడని రసమయి బాలకిషన్ పేర్కొన్నారు.

# 19వ తూర్పు ఆసియా సదస్సులో పాల్గొన్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : లావో పిడిఆర్ లోని వియాంటియన్ లో నేడు జరిగిన 19వ తూర్పు ఆసియా సదస్సు (ఈఏఎస్)కి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హాజరయ్యారు.

ఇండో-పసిఫిక్ ప్రాంతీయ రాజకీయ నిర్మాణంలోనూ, భారతదేశపు ఇండో-పసిఫిక్ దార్శనికత, క్వాడ్ సహకారంలో- ఆసియాన్ పాత్ర చాలా కీలకమని ప్రధానమంత్రి తన ప్రసంగంలో వివరించారు. తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సులో భారతదేశం పాల్గొనడం తన తూర్పు దేశాల ప్రాధాన్యత (యాక్ట్ ఈస్ట్)లో ముఖ్యమైన విధానమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో శాంతికి, అభివృద్ధికీ- స్వేచ్ఛ, సమ్మిళిత, సుసంపన్నమైన, నియమాల ఆధారిత ఇండో-పసిఫిక్ ముఖ్యమని చెబుతూ భారతదేశ ఇండో-పసిఫిక్ మహాసముద్ర కార్యక్రమం, ఇండో-పసిఫిక్‌పై ఆసియాన్ దృక్పథం మధ్య సారూప్యత, సాధారణ విధానం గురించీ మాట్లాడారు. ఈ ప్రాంతం విస్తరణ వాదంపై దృష్టి సారించడం కంటే అభివృద్ధి ఆధారిత విధానాన్ని అనుసరించాలని ఆయన స్పష్టం చేశారు.

ఈఏఎస్ యంత్రాంగం ప్రాముఖ్యతను, దానిని మరింత బలోపేతం చేయడానికి భారతదేశం అందిస్తున్న మద్దతును పునరుద్ఘాటిస్తూ, నలంద విశ్వవిద్యాలయ పునరుద్ధరణపై ఈఏఎస్ భాగస్వామ్య దేశాల నుండి లభించిన మద్దతును ప్రధాన మంత్రి గుర్తు చేసుకున్నారు. నలంద విశ్వవిద్యాలయంలో జరిగే ఉన్నత విద్యాధిపతుల సదస్సు కోసం ఈఏఎస్ దేశాలను ఆహ్వానించడానికి ప్రధాన మంత్రి ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు.

ఇండో-పసిఫిక్‌లో శాంతి, సుస్థిరత, శ్రేయస్సును ప్రభావితం చేసే ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై కూడా నేతలు అభిప్రాయాలను పంచుకున్నారు. దక్షిణార్థ గోళంలోని దేశాలపై ప్రపంచ సంఘర్షణల తీవ్ర ప్రభావాన్ని ప్రస్తావిస్తూ... ప్రపంచంలోని సంఘర్షణల శాంతియుత పరిష్కారం కోసం మానవతా దృక్పథం ఆధారంగా సంభాషణ, దౌత్య మార్గాలను అవలంబించాలని ప్రధాని అభిప్రాయపడ్డారు. యుద్ధభూమిలో వాటికి పరిష్కారం దొరకదని పునరుద్ఘాటించారు. సైబర్, సముద్ర సవాళ్లతో పాటు తీవ్రవాదం- ప్రపంచ శాంతి, భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తోందని, వాటికి వ్యతిరేకంగా దేశాలన్నీ కలిసికట్టుగా పోరాడాలని ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు.

తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సుని విజయవంతంగా నిర్వహించినందుకు లావోస్ ప్రధానమంత్రికి... శ్రీ నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. ఆసియాన్ కొత్త అధ్యక్ష స్థానాన్ని తీసుకోబోతున్న మలేషియాకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అందుకు భారతదేశం పూర్తిగా మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు.

# స్పెషల్ బస్సుల పేరుతో విపరీతంగా పెంచిన ఆర్టీసీ ఛార్జీలు.. మండిపడ్డ హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 14 : సామాన్యుల జేబులను ఖాళీ చేసేలా.. టీజీఎస్ ఆర్టీసీ టికెట్ ధరలను పెంచింది. టికెట్ ధరల పెంపుపై రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆర్టీసి టికెట్ ధరలు విపరీతంగా పెంచి బతుకమ్మ, దసరా పండుగ సమయంలో సొంతూళ్ళకు వెళ్లిన ప్రయాణికుల నుండి ముక్కు పిండి ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గం అని ధ్వజమెత్తారు.

టికెట్ ధర రూ. 140తో జేబీఎస్ నుండి సిద్దిపేటకు వెళ్లిన ప్రయాణికుడు తిరుగు ప్రయాణంలో టికెట్ ధర రూ. 200 చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

హనుమకొండ నుండి హైదరాబాద్ సూపర్ లగ్జరీ బస్సు ప్రయాణం సాధారణ రోజుల్లో రూ. 300 ఉంటే, పండుగ వేళ రూ.420కి ఛార్జీలు పెంచిందని తెలిపారు. బస్సుల సంఖ్య పెంచకుండా, టికెట్ ఛార్జీలు పెంచి తెలంగాణ ప్రజలకు పండుగ సంతోషాన్ని లేకుండా చేయడమే ప్రజా పాలనన ముఖ్యమంత్రి గారు.. అని హరీశ్ రావు ప్రశ్నించారు.

# అక్టోబర్ 15న న్యూఢిల్లీలో ఐపీఎస్ ప్రొబేషనర్లతో కేంద్ర హోం, సహకారశాఖల మంత్రి, శ్రీ అమిత్ షా భేటీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా, అక్టోబర్ 15, మంగళవారం న్యూఢిల్లీలో ఏర్పాటైన ఒక కార్యక్రమంలో, శిక్షణ పొందుతున్న '76 ఆర్.ఆర్. (సాధారణ ప్రవేశం పొందిన) బ్యాచ్' ఐపీఎస్ అధికారులను కలుసుకుంటారు. ఈ భేటీ లో భాగంగా 2023 బ్యాచ్ కు చెందిన వీరంతా తమ శిక్షణ అనుభవాలను మంత్రితో పంచుకుంటారు. 2047 నాటికల్లా భారత్ ను సంపూర్ణ అభివృద్ధి చెందిన దేశంగా మలచాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ధ్యేయాన్ని సాకారం చేయడంలో యువ పోలీసు అధికారుల పాత్ర ఎంతో కీలకమైనది. కార్యక్రమంలో భాగంగా, దేశ అంతర్గత భద్రత సవాళ్ళను అధిగమించడంలో ప్రొబేషనరీ అధికారులకు హోం మంత్రి మార్గనిర్దేశం చేస్తారు.

2023 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన 54 మంది మహిళా అధికారులు సహా మొత్తం 188 మంది తొలి దశ ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకున్నారు. ఢిల్లీలోని కేంద్రీయ సాయుధ పోలీసు దళం-సీఏపీఎఫ్, కేంద్రీయ పోలీసు సంస్థలు-సీపీఓ వంటి సంస్థల్లో రెండు వారాల శిక్షణ అనంతరం వీరంతా వారివారి ప్రత్యేక విభాగాల్లో 29 వారాల అభ్యాసాలతో కూడిన జిల్లా స్థాయి శిక్షణలో పాల్గొంటారు.

# సుస్థిరాభివృద్ధి లక్ష్యం గల నగరాలు, ఆరోగ్యం, వ్యవసాయ రంగాలకు సంబంధించి 3 'అత్యుత్తమ కృత్రిమ మేధ' కేంద్రాలను నేడు కేంద్రమంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : సుస్థిరాభివృద్ధి లక్ష్యం గల నగరాలు, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయ రంగాలకు సంబంధించి, 3 'అత్యుత్తమ కృత్రిమ మేధ కేంద్రాల'ను కేంద్రమంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ అక్టోబర్ 15న న్యూఢిల్లీలో ప్రారంభిస్తారు.

'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా ప్రారంభమవుతున్న ఈ మూడు 'అత్యుత్తమ కృత్రిమ మేధ' కేంద్రాలకు, ఉన్నత స్థాయి విద్యా సంస్థలు నేతృత్వం వహిస్తాయి. ఇందుకు పరిశ్రమ వర్గాల, అంకుర పరిశ్రమల సహకారం తీసుకుంటాయి. ఈ మూడు రంగాల బహువిషయిక అంశాలతో కూడిన పరిశోధనల నిర్వహణ, అత్యాధునిక సాంకేతిక ద్వారా అత్యంత సమర్థంగా పనిచేసే వ్యవస్థల నిర్మాణాన్నీ చేపడతాయి. మూడు కీలక రంగాల్లో సమర్థమైన కృత్రిమ మేధ వాతావరణ కల్పన, నాణ్యమైన మానవ వనరులకు ప్రోత్సాహం లక్ష్యంగా పథకం రూపుదిద్దుకుంటోంది.

"భారత్ లో తయారైన ఏఐ, భారత్ కోసం పనిచేసే ఏఐ" లక్ష్యంగా, ఈ కేంద్రాల ఏర్పాటు 2023-24 వార్షిక బడ్జెట్, 60వ పేరాలో ప్రకటించారు. తదనుగుణంగా, మూడు కేంద్రాల ఏర్పాటుకు 2023-24 నుంచి, 2027-28 మధ్య కాలానికి 990 కోట్ల రూపాయలను కేటాయించారు.

పథకం అమలు నిమిత్తం జోహో కార్పొరేషన్ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ శ్రీధర్ వెంబు సహ అధ్యక్షుడిగా, ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

కార్యక్రమానికి ఉన్నత విద్యా విభాగ కార్యదర్శి శ్రీ కె. సంజయ్ మూర్తి, ఐఐటీ విద్యా సంస్థల డైరెక్టర్లు, ఉన్నత విద్యా సంస్థల, పరిశ్రమల అధిపతులూ, అంకుర పరిశ్రమల వ్యవస్థాపకులు, వివిధ మంత్రిత్వ శాఖల సీనియర్ అధికారులు హాజరవుతారు.

# స్కిల్ ఇండియా మిషన్‌లో ఏఐ అసిస్టెంట్‌తో పాటు ఎన్ఎస్‌టిఐలలో 5 ఉన్నత నైపుణ్య కేంద్రాల ఏర్పాటుకు మెటా తో జట్టు కట్టిన ఎమ్ఎస్‌డీఈ




న్యూఢిల్లీ, అక్టోబర్ 14 : రెండు ప్రధాన కార్యక్రమాలను నిర్వహించడానికి మెటా తో భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ (ఎమ్ఎస్‌డీఈ) ఢిల్లీలో ఈ రోజు ప్రకటించింది. స్కిల్ ఇండియా మిషన్ కోసం ఉద్దేశించిన ఒక కృత్రిమ మేధ సహాయక వ్యవస్థ (ఏఐ అసిస్టెంట్)ను ఏర్పాటు చేయడం ఇందులో మొదటిది. హైదరాబాద్, బెంగళూరు, జోధ్ పుర్, చెన్నై, కాన్పూర్ లలో ఉన్న నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్ఎస్‌టీఐ) లో వర్చువల్ రియాలిటీ (వీఆర్), మిక్స్‌డ్ రియాలిటీ (ఎమ్ఆర్) రంగాలకు సంబంధించిన 5 ఉన్నత నైపుణ్య కేంద్రాల (సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్.. సీఓఈలు)ను ఏర్పాటు చేయడం రెండోది.

ఈ భాగస్వామ్యం గురించి నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) శ్రీ జయంత్ చౌధరి మాట్లాడుతూ, "మన దేశంలో యువతీ యువకులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో ముందుకు సాగిపోవడానికి అవసరమైన నైపుణ్యాలను వారికి అందించాలన్నదే మా మంత్రిత్వ శాఖ ధ్యేయం. కృత్రిమ మేధ (ఏఐ), వర్చువల్ రియాలిటీ (వీఆర్), మిక్స్‌డ్ రియాలిటీ (ఎమ్ఆర్)ల వంటి సాంకేతికతలను స్కిల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా చేయడం ద్వారా అత్యాధునిక సాంకేతికతలు అందరికి అందుబాటులోకి వచ్చేటట్లుగా చూస్తూ, దేశంలో యువత అన్ని నూతన పద్ధతులను వ్యక్తిగతంగా వారే అంది పుచ్చుకొనేటట్లుగా మేం కృషి చేస్తున్నాం. మెటా తో ఈ రోజున మేం కుదుర్చుకొన్న భాగస్వామ్యం ఈ లక్ష్యాన్ని సాధించడంలో ఒక ముఖ్యమైన ముందంజ అని చెప్పాలి" అన్నారు.

ఈ భాగస్వామ్యం ద్వారా, మెటాకు ఉన్న ఓపెన్-సోర్స్ లామా నమూనా అండతో ఒక సరికొత్త ఏఐ-చాట్ బాట్ (ఎఐ-ఇఫ్త్రజీబిఎనీబి) ను అభివృద్ధి చేస్తారు. ఇది స్కిల్ ఇండియా డిజిటల్ (ఎస్ఐడీ) పోర్టల్ లో అభ్యాస ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఎస్ఐడీ పోర్టల్ లో ఒక భాగంగా కలిపివేసే చాట్ బాట్ వినియోగదారులకు ప్రతి రోజూ 24 గంటలూ సహాయాన్ని అందిస్తుంది. ఫలితంగా వారు ఈ పాఠ్యక్రమం (కోర్స్) సమాచారాన్ని ఇట్టే అవగాహన చేసుకోవచ్చు. కోర్సు కు సంబంధించిన ప్రశ్నలను అడగడం- జవాబులను రాబట్టుకోవడం, లెక్చర్ సారాంశాలు అందుబాటులో ఉండడం, రివిజన్ కోసం తత్సంబంధిత వీడియోలను ఉపయోగించుకోవడం చేయవచ్చు. వాట్సాప్ (చిఫ్త్రజీబిబంజూజూ)లో లభించే చాట్ బాట్ ఇంగ్లిషులో, హిందీలో, ఈ రెండు భాషల మిశ్రమంలో కూడా లభ్యం అవుతుంది. దీనికి స్వర ఆధారిత శక్తి సామర్థ్యాలను కూడా జతపరచనున్నారు. దీనివల్ల దేశం అంతటా వేరు వేరు అవసరాలతో పోర్టల్ ను సందర్శించే వారికి ఇది మరింత చేరువ కాగలుగుతుంది. దీనికి అదనంగా, యూజర్ లు తమకు కావాల్సిన ఫలానా కోర్సు అంశాలను మాత్రమే కూడా అన్వేషించ వచ్చు. నైపుణ్యాలను అందించే కేంద్రాలు ఎక్కడ ఉన్నదీ కనుక్కోవచ్చు. వారికి వీలైన ప్రాంతంలో, వారి అభిరుచుల మేరకు సరిపడే ఉద్యోగ అవకాశాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవచ్చు. అంతేకాకుండా, నిరంతరం మెరుగుదల కోసం వారి వారి అవసరాలకు అనుగుణంగా ఉండే ఫీడ్ బ్యాక్ ను కూడా వారు అందుకొనేందుకు అవకాశం ఉంటుంది. ఈ ప్లాట్ ఫామ్ సేవల పరిధిని మరింత పెంచడానికి వీలుగా విలువైన విశ్లేషణ పూర్వక అంశాలను సైతం మంత్రిత్వ శాఖకు చాట్ బాట్ సమకూరుస్తుంది. ఏఐ అసిస్టెంట్ ప్రాజెక్టుకు సాంకేతిక భాగస్వామిగా వ్యవహరించే 'సర్వమ్ ఏఐ' ఆరు నెలల కాలం లోపు ప్రయోగాత్మక ప్రాతిపదికన చాట్ బాట్ ను తీర్చిదిద్ది రంగంలోకి దించే బాధ్యతను తీసుకోనుంది.

మెటా కు చెందిన ఓపెన్-సోర్స్ ఏఐ నమూనాలను దేశంలోని ఏఐ వ్యవస్థకు సహాయకారిగా మలచడం లోని ప్రధాన ఉద్దేశం ఏమిటంటే అది ఏఐ మిషన్ అవసరాలను తీర్చే భారీ సామాజిక, ఆర్థిక పరివర్తనకు దోహద పడే ప్రభావశీల ఏఐ పరిష్కారాలను అమలు లోకి తెచ్చేందుకు ఇ-గవర్నెన్స్ తో కలిసి పని చేయాలి అనేదే. ఎన్ఎస్‌టీఐలలో ఏర్పాటు చేసే అయిదు ఉన్నత నైపుణ్య కేంద్రాలు (సీఓఈ స్) ఒక సురక్షితమైన వాతావరణంలో వర్తమాన నైపుణ్యాల కు మెరుగులు పెట్టుకొనేటందుకు అత్యాధునిక వీఆర్ సాంకేతికతను అటు బోధకులకు, ఇటు విద్యార్థులకు కూడా అందించనున్నాయి. ఏఐ అసిస్టెంట్ అంశంలో ఏర్పడ్డ భాగస్వామ్యం విద్యార్థులకు డిజిటల్ మాధ్యమం పరంగా నిరంతరం మద్దతును అందిస్తూ, సమాచార లభ్యతను సాఫీగా ఉండేటట్లుగా చూసి వారి విజ్ఞానార్జన పరిధిని పెంచనుంది. ఈ అయిదు కేంద్రాలు నైపుణ్యాభివృద్ధి సంబంధిత శిక్షణలో వాస్తవ కాల స్థితిగతులను సృష్టించి, విద్యార్థులు వాటితో మమేకమై ముందంజ వేసేందుకు అవకాశాలను కల్పిస్తాయి.

మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్, పబ్లిక్ పాలసీ అధిపతి శ్రీ శివ్‌నాథ్ ఠుక్ రాల్ మాట్లాడుతూ, "మెటా సంస్థ లో మేం ఏఐ, వీఆర్, ఎమ్ఆర్ ల వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి, దేశ ఆర్థిక అభివృద్ధి ఫలితాలు లక్షిత వర్గాలకు చక్కని ప్రయోజనాలను అందించేటట్లుగా చూడటానికి కట్టుబడి ఉన్నాం. నైపుణ్యాభివృద్ధి ? వ్యవస్థాపక శాఖ (ఎమ్ఎస్‌డీఇ)తో మేం కుదుర్చుకున్న భాగస్వామ్యాలు సాంకేతిక విజ్ఞానానికి, విద్యకు మధ్య గల అంతరానికి వంతెన వేయాలన్న మా నిబద్ధతను నిరూపిస్తున్నాయి. ఓపెన్-సోర్స్ లామా వంటి అధునాతన సాంకేతికతల ఏకీకరణ ద్వారా మేం విద్యార్థులకు సాధికారితను కల్పించడమే కాకుండా విద్యను బోధించే వారితో పాటు వ్యవస్థాపకులకు కూడా- డిజిటల్ మాధ్యమానికి పెద్దపీటను వేస్తున్న ప్రస్తుత ప్రపంచంలో- వారు రాణించడానికి కావలసిన శక్తియుక్తులను వారికి సమకూర్చాలని ధ్యేయంగా పెట్టుకొన్నాం" అని వివరించారు.

దేశంలో నైపుణ్యాల సంపాదన సంబంధిత వ్యవస్థలో స్కిల్ ఇండియా డిజిటల్ పోర్టల్' ఒక కీలక పాత్రధారిగా మారింది. లక్షల కొద్దీ విద్యార్థులు ఈ కాలంలో ఉద్యోగాలకు అవసరమైన వివిధ అర్హతలను సంపాదించుకొని వారిని వారు తీర్చిదిద్దుకోవడానికి తగిన పాఠ్యక్రమాలను అనుసరిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో, ఈ పోర్టల్ కు ఉన్న ప్రాముఖ్యం పెరిగింది. ఏఐ చాట్ బాట్ ను ప్రవేశపెట్టే క్రమంలో ఎమ్ఎస్‌డీఈ, ఇంకా మెటా లు కోర్సు కంటెంట్ తో విద్యార్థులు ఏ విధంగా ముందు పోతూ, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎలా సన్నద్ధులు కావాలో అనే విషయంలో ఒక ముఖ్యమైన ముందడుగును వేయబోతున్నాయి. ఉన్నత నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంలో సాంకేతిక భాగస్వామిగా ఉండే స్కిల్ వెరీ అత్యాధునిక వీఆర్, ఎమ్ఆర్ సంబంధిత వనరులను, పాఠ్య ప్రణాళికలను, సుశిక్షిత వృత్తి నిపుణులను విద్యార్థినీ విద్యార్థులకు, బోధకులకు సమకూర్చనుంది.

# శృతిమించిన బైక్ రేస్.. వాహనాన్ని ఢీకొట్టడంతో చెలరేగిన మంటలు, ఇద్దరు మృతి

కోల్‌కతా, అక్టోబర్ 14 : బైక్ రేస్ శృతిమించింది. రోడ్డు క్రాస్ చేస్తున్న వాహనాన్ని వేగంగా వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఆ బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు మంటల్లో కాలి మరణించారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్‌లో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 11న అర్ధరాత్రి వేళ కొందరు బైకర్లు రేసింగ్ పోటీలు నిర్వహించారు. రోడ్డుపై అతి వేగంగా బైక్‌లు నడిపారు.

కాగా, హుగ్లీలోని పోల్‌బార్ రాజ్‌ఘాట్ ఇంటర్‌సెక్షన్ వద్ద ఒక ఎస్‌యూవీ మలుపు తిరిగింది. ఒక బైకర్ ఆ వాహనం ముందు నుంచి దూసుకుపోయాడు. దాని వెనుక వేగంగా వచ్చిన మరో బైక్ ఆ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం ధాటికి పెద్ద పేలుడు సంభవించడంతోపాటు మంటలు చెలరేగాయి.

మరోవైపు ఆ బైక్‌ను నడిపిన వ్యక్తి, వెనుక కూర్చొన్న మరో వ్యక్తి మంటల్లో కాలిపోయారు. మంటల్లో చిక్కుకున్న వారిని పక్కకు లాగేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. అనంతరం కాలిన గాయాలతో వారిద్దరూ మరణించారు. బొలెరో వాహనంలో ఉన్న వారు కూడా ఈ ప్రమాదంలో గాయపడ్డారు. కాగా, ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# అప్పు పుట్టకపోవడం వల్లే రుణమాఫీ కాలే: మంత్రి తుమ్మల

-డిసెంబర్ 9 నాటికి పూర్తిచేస్తాం
-ఈ ఏడాది రెండో పంటకు రైతు భరోసా
-రైతు సదస్సులో మంత్రి తుమ్మల

హైదరాబాద్, అక్టోబర్ 14 : అప్పు పుట్టకపోవడం వల్లే రైతు రుణమాఫీ ప్రక్రియ ఆలస్యమైందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ పుట్టిన రోజైన డిసెంబర్ 9నాటికి రుణమాఫీ పూర్తి చేస్తామని ప్రకటిం చారు. భద్రాద్రి జిల్లా అశ్వారావు పేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో ఆయిల్‌పాం సాగుపై శనివారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా రుణమాఫీ పూర్తికాక పోవడానికి రుణం లభించకపోవడమే కారణమని తెలిపారు. అయినప్పటికీ డిసెంబర్ 9 నాటికి రుణమాఫీ పూర్తి చేస్తామని చెప్పారు.

గత డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఈ ఏడాది డిసెంబర్ 9 వరకు రుణమాఫీ పూర్తి చేస్తామని మంత్రి చెప్పడంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. పైగా అప్పు తీర్చడం కోసం అప్పు పుట్టలేదని చెప్పడంతో రుణమాఫీ ఎగ్గొడుతారనే అనుమానాలు వ్యక్తంచేశారు.

రుణమాఫీ ఇక మాఫీయేనా.. అని రైతులు గుసగుసలలాడుకున్నారు. ఇదిలా ఉంటే, తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంలో రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ ఏడాది రెండో పంట కాలంలో రైతులకు 'రైతు భరోసా' అందిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు కసరత్తు వేగవంతం చేస్తున్నారని వివరించారు.

# సీనియర్ కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నన్ కు తైక్వాండో లో బ్లాక్ బెల్ట్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 14 : (నేటినిజం ప్రతినిధి): ఈనెల 13, వ తేదీన హైదరాబాద్ లో జరిగిన తైక్వాండో కరాటే గ్రేడింగ్ టెస్ట్ లో వేములవాడకు చెందిన సీనియర్ కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నన్ ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్టు ను కైవసం చేసుకొని, తైక్వాండో కరాటే అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్ కు బ్లాక్ బెల్టును అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ మన్నన్ మాట్లాడుతూగత 30 సంవత్సరాల నుండి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో మాస్టర్ మన్నన్ వందలాదిమంది బాల బాలికలకు శిక్షణ ఇస్తూ రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి , ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో మెడల్స్ సాధిస్తున్నారని కొనియాడారు. కరాటే లో బ్లాక్ బెల్ట్5 డాన్ గా కొనసాగుతున్నానని తెలిపారు. తైక్వాండో కరాటే క్రీడాను జిల్లాలో బలోపేతం చేస్తానని కృషి చేస్తానని అన్నారు. ప్రతిరోజు వేములవాడలో సినారె కళామందిర్ లో సాయంత్రం 5.30 గంటలకు కరాటే, టైక్వాండో శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు.




# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం

## - నియోజకవర్గం కన్వీనర్ గా ఎడ్ల జోగిరెడ్డి

కరీంనగర్,అక్టోబర్ 14 : (నేటినిజం ప్రతినిధి) తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానకొండూరు నియోజకవర్గ కన్వీనర్ గా ఎడ్ల జోగిరెడ్డి నియామకం.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కేంద్రానికి చెందిన ఎడ్ల జోగి రెడ్డి గత రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ ఉద్యమం పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. ఉద్యమ పోరాట సమయంలో అనేక మంది మహానేతలు, నాయకులతో కలిసి ఉద్య మంలో పాల్గొని చురుకైన పాత్ర పోషించారు. తెలం గాణ ఉద్యమంలో ఎడ్ల జోగిరెడ్డి చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ చీమ శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానకొండూరు నియోజక వర్గం కన్వీనర్ గా ఎడ్ల జోగి రెడ్డిని నియామకం చేసినట్లు సోమవారం పత్రిక ప్రకటనలు ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్ల జోగిరెడ్డి మాట్లాడుతూ...నా నియామకానికి సహకరించిన ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడు ఓరుగంటి ఆనంద్, జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి లతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, రాష్ట్ర నాయకు లకు, జిల్లా బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమం పుట్టి దాదాపు 23 ఏళ్లు పూర్తిగా అయ్యింది అని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత అధికారం చేపట్టిన టిఆర్ఎస్ ప్రభుత్వం అస లైన తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరులు వారి కుటుంబాలను విస్మరించిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు, అమరవీరులు, ఉద్యోగ సంఘాలతో పాటు కుల,మతాలకతీతంగా సబ్బండ వర్గాల పోరాటంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైంది అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మొదటిసారి అధికారం చేపట్టిన టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో చురు కైన పాత్ర పోషించిన మహానేతలు, అమరవీరులు, ఉద్యమ నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టులను విస్మరించిందన్నారు. దాని ఫలితమే ఇటీవల టి ఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిందని అన్నా రు. కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తెలం గాణ ఉద్యమ పోరాటంలో పాల్గొన్న ఉద్యమకారులు, అమరవీరులు వారి కుటుంబాలు, నాయకులను, కార్యకర్తలను, జర్నలిస్టులను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చి,అన్ని రకాలుగా సహాయ, సహకా రాలు అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.



# స్వగ్రామంలో దసరా వేడుకలు జరుపుకున్న చల్మెడ

-చిన్ననాటి స్నేహితులను, గ్రామస్తులను కలిసి ఆప్యాయంగా పలకరించిన చల్మెడ
-చల్మెడ రాకతో సందడిగా మారిన మల్కపేట

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 14 : (నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గం కోనరావుపేట మండలం మల్కపేట గ్రామ ముద్దుబిడ్డ బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు గారు శనివారం విజయదశమి వేడుకలు స్వగ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులను, గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తూ దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ వారితో కాసేపు ముచ్చటించారు. పండుగ వేళ సొంత గ్రామంలో దసరా పండుగ జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఈ వేడుకలో వారితోపాటు కరీంనగర్ డైరీ చైర్మన్ రాజేశ్వర్ రావు గారు, మల్కపేట, నాయకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు



# యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయ అభివృద్ధికి చర్యలు

-రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
-రాజన్న ఆలయ అభివృద్ధి పై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి
-భక్తుల సౌకర్యార్థం అవసరమైన అన్ని వసతులు కల్పిస్తాం

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 14 : (నేటినిజం ప్రతినిధి): యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు



ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.

సోమవారం వేములవాడ పట్టణంలో పర్యటించిన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ , ఎస్పీ అఖిల్ మహజన్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. వేములవాడ రాజన్న ఆలయం అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి ఆలయంలోకి స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వాదం మధ్యలో మంత్రి స్వామి వారి దర్శనం చేసుకుని కోడే మొక్కలు చెల్లించారు. రాజన్న దేవాలయం సన్నిధిలో మనవడి పుట్టి వెంట్రుకల కార్యక్రమాన్ని మంత్రి కుటుంబ సభ్యుల తో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ×మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాజన్న దేవాలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, త్వరలోనే రాజన్న దేవాలయ అభివృద్ధి పై సీఎం స్థాయిలో అత్యున్నత సమావేశం జరుగుతుందని, శాస్త్రాల ప్రకారం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని రకాల వసతులను కల్పిస్తూ ఆలయ అభివృద్ధికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలవకుండా చర్యలు తీసుకున్నామని, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని అన్నారు. యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, యాదాద్రి ఆలయానికి 63 కేజీల బంగారంతో తాపడం ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. వేములవాడ దేవాలయం వద్ద 65 కేజీల బంగారం 5000 కిలోల వెండి అందుబాటులో ఉందని వీటిని వినియోగించుకొని వేములవాడ ఆలయానికి సైతం బంగారు తాపడం, వెండితో పల్లకీలు, ఉత్సవ విగ్రహాలు రూపొందించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి బద్ది పోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటనలో మంత్రి వెంట ఆలయ ఈ.ఓ. వినోద్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ మహేష్, అర్.డి. ఓ. రాజేశ్వర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు - కెటిఆర్

హైదరాబాద్, అక్టోబర్ 14 : మౌలాలిలో ప్రొఫెసర్ సాయిబాబా భౌతిక కాయానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కేటీఆర్ ప్రార్థించారు. హక్కుల ఉద్యమకారుడు ప్రొఫెసర్ సాయిబాబా అకాల మరణం బాధాకరం అని కేటీఆర్ పేర్కొన్నారు. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. దేశంలోని ప్రజా ఉద్యమాలకు ప్రొఫెసర్ సాయిబాబా మరణం తీరని లోటు అని కేటీఆర్ అన్నారు కేటీఆర్ వెంట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బాల్క సుమన్, పల్లె రవి కుమార్, తుల ఉమతో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.



# సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌కు కేటీఆర్ పరామర్శ

హైదరాబాద్, అక్టోబర్ 14 : ఇటీవలే తన కూతురు గాయత్రి ఆకస్మిక మరణంతో ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్ తీవ్ర శోకసంద్రంలో ఉన్నారని తెలిసిందే. ఈ మేరకు ఆయనను పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పరామర్శిస్తున్నారు. ఇవాళ రాజేంద్రప్రసాద్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు.

రాజేంద్రప్రసాద్ నివాసానికి వెళ్లిన కేటీఆర్ గాయత్రి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి.. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. రాజేంద్రప్రసాద్‌ను ఓదార్చిన కేటీఆర్ ఆయనలో మనోధైర్యాన్ని నింపారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్ ఉన్నారు.

# మరోమారు సేవా గుణాన్ని చాటుకున్న ఎమ్మెల్యే బండారి.. అభినందించిన కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 14 : నిరుపేదలకు చేయూతనందించడంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎప్పుడూ ముందే ఉంటారు. మరోసారి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తన సేవా గుణాన్ని చాటుకున్నారు. ఎంబీబీఎస్ విద్యార్థిని చదువుకి ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలబడ్డారు. వివరాలల్లోకి వెళ్తే..చర్లపల్లి డివిజన్ మధుసూదన్ రెడ్డి కాలనీకి చెందిన లింగోజీ రమేశ్ - మంగమ్మ కుమార్తె తేజ శ్రీ కొత్తగూడం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది.

ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి తన సొంత నిధులతో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్‌కి అయ్యే ఫీజు 29,000 రూపాయల చెక్కును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.